

ఫైళ్ల క్లియరెన్స్‌లో మంత్రి అనితకు 20వ ర్యాంకు



అనకాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర మంత్రులకు ర్యాంకులు ప్రకటించారు. గత ఏడాది జూన్‌లో మంత్రులుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి డిసెంబరు వరకు ఫైళ్ల క్లియరెన్స్‌లో పనితీరు ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటించారు. జిల్లాకు చెందిన రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత 20వ ర్యాంకులో వున్నారు. సీఎంతో సహా మొత్తం 25 మందికి ర్యాంకులు ప్రకటించారు.

వైసీపీ నేత భూ దందా

కొండుపాలెంలో రూ.కోటి విలువ చేసే మూడు ప్రభుత్వ స్థలాలు కబ్జా

- ఇటీవల షెడ్లు వేసి.. అక్రమంగా రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నాలు





కొండుపాలెంలో వైసీపీ నేత ఆక్రమించిన స్థలాల్లో వేసిన రేకుల షెడ్లు

- కూటమి పాలనలోనూ ఆగని వైసీపీ నేత భూ ఆక్రమణలు
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన స్థానికులు
- ఇంతవరకు పట్టించుకోని అధికారులు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినప్పటికీ వైసీపీ నేతల భూదందా మాత్రం కొనసాగుతూనే వుంది. రెవెన్యూ ఉద్యోగుల అండదండలతో ప్రభుత్వ భూములను చెరబడుతున్నారు. అనకాపల్లి మండలం కొండుపాలెంలో సుమారు కోటి రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాలను వైసీపీ నాయకుడొకరు దర్జాగా ఆక్రమించాడు. వైసీపీ నేతలు గతంలో పాల్పడిన భూ కబ్జాలు.. కూటమి ప్రభుత్వం తాజాగా చేపట్టిన భూముల రీసర్వేలో వెలుగులోకి వస్తున్నాయి.

కొండుపాలెం గ్రామానికి సమీపంలో జాతీయ రహదారి ఉండడం, కోడూరులో పారిశ్రామిక సెజ్ ఏర్పాటు చేయడంతో ఇక్కడ భూముల విలువ గణనీయంగా పెరిగింది. సెంటు స్థలం లక్ష రూపాయలకుపైగా ధర పలుకుతున్నది. వైసీపీ మండలస్థాయి నేత ఒకరు, నాటి మంత్రి అండదండలతో కొండుపాలెంలో ప్రభుత్వ భూములను కబ్జాచేయడం మొదలుపెట్టాడు. సర్వే నంబరు 64లో జగనన్న కాలనీకి కేటాయించిన స్థలానికి సమీపంలో సుమారు 10 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేశాడు. సమీపంలో సర్వే నంబరు 189లో ప్రభుత్వం గతంలో ఒక వ్యక్తికి కేటాయించిన సుమారు 55 సెంట్లను దౌర్జన్యంగా ఆక్రమించేశాడు. కొందరు రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో నకిలీ పత్రాలను సిద్ధం చేసుకొని రిజిస్ట్రేషన్ కోసం యత్నిస్తున్నట్టు తెలిసింది. ఎవరికీ అనుమానం రాకుండా ఈ స్థలంలో రోడ్డు పక్కన అమ్మవారి గుడి కట్టేందుకు కొంత స్థలాన్ని కేటాయించినట్టు చెబుతున్నారు. గ్రామానికి శివారులో 126 సర్వే నంబరులోని ఎగ్గు చెరువు భూమిని కూడా ఇతను వదల్లేదు. సుమారు 30 సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడు. అప్పట్లో పనిచేసిన రెవెన్యూ ఉద్యోగులను తన గుప్పెట్లో పెట్టుకొని ప్రభుత్వ భూములను దర్జాగా సొంతం చేసుకున్నాడు. ఇతను కబ్జా చేసిన స్థలాల విలువ కోటి రూపాయలకుపైగా వుంటుందని స్థానికులు చెబుతున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చినా....

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసీపీ నేతల భూ ఆక్రమణలపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. కానీ కొండుపాలెంలో మాత్రం దీనికి పూర్తి భిన్నమైన పరిస్థితి నెలకొంది. అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు, సదరు వైసీపీ నేతకు తెరవెనుక సహాయ సహకాలు అందిస్తున్నారు. దీంతో వైసీపీ నేత భూదందాలను కొనసాగిస్తూనే ఉన్నాడు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వున్నప్పుడు కొండుపాలెంలో ఆక్రమించిన భూముల్లో ఇటీవల రేకుల షెడ్లు వేయించాడు. దీనిపై గ్రామానికి చెందిన శెట్టి అర్జున్, శెట్టి మణి, శ్రీనులు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో భూముల రీసర్వే తప్పుల తడకగా వుండడంతో కూటమి ప్రభుత్వం మళ్లీ రీసర్వే చేపడుతున్నది. ఇందులో భాగంగా అనకాపల్లి మండలం గొండుపాలెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ప్రస్తుతం రెవెన్యూ యంత్రాంగం సర్వే నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా కొండుపాలెంలో సర్వే నంబర్లు 64, 189, 126లలో వైసీపీ నేత ఆక్రమించిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాగా కొండుపాలెంలో ప్రభుత్వ స్థలాలను వైసీపీ నేత ఆక్రమించినట్టు అందిన ఫిర్యాదుపై చర్యల గురించి గొండుపాలెం వీఆర్‌ఓ సూర్యనారాయణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, ఇటీవలే కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు అందిందని చెప్పారు. త్వరలో ఆయా సర్వే నంబర్లలో రీసర్వే చేసి ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనట్టు తేలితే తగు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

వడ్డాది-తాటిపర్తి రోడ్డుకు మహర్దశ

శరవేగంగా విస్తరణ, అభివృద్ధి పనులు

- 14 కిలోమీటర్లు.. రూ.23.59 కోట్ల ఏడీబీ నిధులు
- ప్రస్తుత రహదారి ఐదున్నర మీటర్లు
- ఇరువైపులా మీటరు చొప్పున విస్తరణ
- ఏప్రిల్ చివరినాటికి పనులు పూర్తి
- మూడు జిల్లాల వాసులకు తీరనున్న రవాణా ఇక్కట్లు



కేజేపురం, ఎం.కోడూరు మధ్య రోడ్డు పక్కన మీటరు వెడల్పున తవ్వి, రోలింగ్ చేస్తున్న యంత్రాలు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

వడ్డాది -పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో భాగమైన మండలంలో తాటిపర్తి నుంచి బుచ్చెయ్యపేట మండలం వడ్డాది వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం రోడ్డు వెడల్పు ఐదున్నర మీటర్లు వుండగా, ఇరువైపులా ఒక్కో మీటరు చొప్పున విస్తరిస్తున్నారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన ఈ రోడ్డు పనులు ఈ ఏడాది ఏప్రిల్‌లోగా పూర్తవుతాయని ఆర్‌అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

మైదాన ప్రాంతంతో ఏజెన్సీని అనుసంధానించే వడ్డాది- పాడేరు ఆర్‌అండ్‌బీ రహదారిపై ఉమ్మడి మూడు జిల్లాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మాడుగుల మండల ప్రజలు చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు ఈ రోడ్డులోనే వెళ్లాలి. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకులోయ నియోజకవర్గాల్లోని పలు మండలాల ప్రజలు మైదాన ప్రాంతానికి ఈ రోడ్డు గుండానే రాకపోకలు సాగిస్తుంటారు.



ముకుందపురం, కేజే పురం మధ్య తవ్విన ప్రదేశం వద్ద కాంక్రీట్ మిక్చర్ కుప్పలు

కాగా అల్లూరి సీతారామరాజు జిల్లా సరిహద్దులోని మాడుగుల మండలం తాటిపర్తి నుంచి ఘాట్ రోడ్డు మొదలవుతుంది. ఇక్కడి నుంచి పాడేరు వరకు రోడ్డు బాగానే వుంది. అయితే ఇటువైపు తాటిపర్తి నుంచి వడ్డాది వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. సుమారు 14 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులకు 2021 ఫిబ్రవరిలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు రుణం రూ23.59 కోట్లు మంజూరైంది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తరువాత తక్కువ ధరకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌తో ఆర్‌అండ్‌బీ అధికారులు అగ్రిమెంట్ చేసుకున్నారు. అయితే అప్పటికే పనులు మొదలుపెట్టిన బీఎస్ రోడ్డుకు బిల్లులు మంజూరు కాకపోవడంతో ఈ రోడ్డు కాంట్రాక్టర్ చాలా రోజుల వరకు పనులు ప్రారంభించలేదు. రహదారిపై గోతులు పెరిగిపోయి వడ్డాది నుంచి తాటిపర్తి వరకు ప్రయాణించడానికి వాహనదారులకు గంట సమయం పట్టేది. ఈ సమస్య నాటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి బూడి ముత్యాలనాయుడు దృష్టికి ... మిగతా 8వ పేజీలో

విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన



ఉపాధ్యాయుడిని స్టేషన్‌కు తీసుకువెళుతున్న పోలీసులు

దేహశుద్ధి చేసి స్తంభానికి కట్టేసిన బాలిక కుటుంబీకులు

- స్టేషన్‌కు తరలించిన పోలీసులు
- డీఈవో విచారణ

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది జంక్షన్‌లో గల నేషనల్ టాలెంట్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడికి బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు గురువారం దేహశుద్ధి చేశారు. అనంతరం స్తంభానికి కట్టేశారు. బాధితురాలి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని సందేహాలు నివృత్తి చేసుకోవడానికి బుధవారం మధ్యాహ్నం లెక్కల ఉపాధ్యాయుడు దారపు గంగాప్రసాద్ వద్దకు వెళ్లింది. అయితే కొద్దిసేపటి తరువాత రమ్మని చెప్పడంతో సాయంత్రం వెళ్లింది. విద్యార్థిని వెళ్లిన వెంటనే క్లాస్ రూమ్ తలుపులు దగ్గరగా వేసిన ఉపాధ్యాయుడు ఆమె చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక ఏడుస్తూ బయటకు వచ్చి స్కూల్ ఆయాకు విషయం చెప్పింది. ఈ సమాచారం తెలిసి విద్యార్థిని తల్లిదండ్రులు స్కూల్‌కు వచ్చి ఆమెను ఇంటికి తీసుకువెళ్లారు. ఇంటికి వెళ్లిన తరువాత విద్యార్థిని జరిగిన ఘటన గురించి తల్లిదండ్రులకు చెప్పడంతో గురువారం ఉదయం వారు, వారి కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఉపాధ్యాయుడు గంగాప్రసాద్ మరో పాఠశాలలో ఉన్నట్టు తెలుసుకుని అక్కడకు వెళ్లి కొట్టుకుంటూ ఘటన ... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలి స్టేషన్‌కు సొబగులు



ఎలమంచిలి రైల్వే స్టేషన్

అమృత్ భారత్ కింద రూ.13 కోట్లతో అభివృద్ధి

- మూడో ప్లాట్‌ఫారం నిర్మాణం
- కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్
- ప్లాట్ ఫారాలపై మార్బుల్స్, యాంటీ స్కిడ్ టైల్స్
- వర్షం పడినా ప్రయాణికులు ఇబ్బంది పడకుండా రేకుల షెడ్లు
- బోగీల పొజిషన్ తెలిపేలా డిజిటల్ ఇండికేటర్లు
- ఆధునిక వసతులతో వెయిటింగ్ హాల్, బాత్‌రూమ్‌లు
- ఆరు నెలల్లో మారనున్న రైల్వే స్టేషన్ రూపురేఖలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ల జాబితాలో ఎలమంచిలిని కూడా చేర్చింది. ఇప్పటికే రెండు ప్లాట్‌ఫారాలు వుండగా కొత్తగా మరో ప్లాట్ ఫారం నిర్మించారు. అన్ని ప్లాట్‌ఫారాలపై గచ్చు స్థానంలో మార్బుల్స్ వేస్తున్నారు. ఒకటో నంబరు ప్లాట్ ఫారం నుంచి 2, 3 నంబర్ల ప్లాట్‌ఫారాలకు రాకపోకల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్, లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇంకా ఆధునిక శౌచాలయాలు, వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నారు.



రెండో నంబరు ప్లాట్‌ఫారంపై నిర్మాణంలో ఉన్న షెడ్లు



ఒకటో నంబరు ప్లాట్‌ఫారానికి అనుసంధానంగా నిర్మిస్తున్న వెయిటింగ్ హాల్

ఎలమంచిలి నియోజకవర్గంలో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాలు పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే ప్రత్యేక ఆర్థిక మండలిలో పదుల సంఖ్యలో పలు రకాల పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. మరికొన్ని ఏర్పాటవుతున్నాయి. అచ్యుతాపురం మండలంలో బార్క్ నిర్మాణం జరుగుతున్నది. ఇక రాంబిల్లి మండలంలో ప్రత్యామ్నాయ నేవల్ బేస్ ఏర్పాటవుతున్నది. ఎస్‌ఈజడ్‌లో ఎన్‌టీపీసీ లక్ష కోట్ల రూపాయలతో గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ను నిర్మించనున్నది. దీంతో కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగులు ... మిగతా 8వ పేజీలో



కొత్తగా నిర్మిస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి

బాబోయ్‌ బడి ఆటోలు!

పరిమితికి మించి విద్యార్థులను ఎక్కిస్తున్న డ్రైవర్లు

- ఒక్కో ఆటోలో ఆరుగురు పిల్లలను మాత్రమే తీసుకెళ్లాలని నిబంధన
- చిన్న ఆటోలో పది మంది, పెద్ద ఆటోలో 15-20 మంది వరకు తరలింపు
- వెనుక వైపు జైలు ఊచలు మాదిరిగా గ్రిల్స్
- చిన్నారుల ప్రాణాలతో చెలగాటం
- కొరవడిన రవాణా, పోలీసు అధికారుల తనిఖీలు

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):

కొంతమంది ఆటో డ్రైవర్లు రవాణా శాఖ నిబంధనలను అడ్డగోలుగా ఉల్లంఘిస్తున్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళుతున్నారు. ముఖ్యంగా బడి పిల్లలను తీసుకెళ్లే ఆటోల పరిస్థితి మరింత దారుణంగా వుంటున్నది. ముగ్గురు ప్రయాణించాల్సిన ఆటోలో పది మంది విద్యార్థులను, ఆరుగురిని తీసుకెళ్లాల్సిన ఆటోలో 15-20 మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారు. స్కూల్ బాగులు, భోజనం క్యారేజీలు, వాటర్ బాటిళ్లతో పిల్లలు ఆటోల్లో ఇరుక్కుని వెళ్లాల్సి వస్తున్నది. రవాణా, పోలీసు శాఖల అధికారులు ఎక్కడా తనిఖీలు చేసిన పాపానపోలేదు.



ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళుతున్న డ్రైవర్. పక్కనే కునుకు తీస్తున్న చిన్నారి

జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో ఎక్కువ మంది ఆటోల్లో రాకపోకలు ... మిగతా 8వ పేజీలో




ఆటో వెనుకవైపు కూర్చున్న విద్యార్థులు, గ్రిల్‌కు వేలాడదీసిన బ్యాగులు

శక్తిపీఠంగా రేబాక గూడుపమ్మ ఆలయం

- నాలుగేళ్లలో రూ.కోటితో నిర్మాణం
- అష్టాదశ శక్తిపీఠాలు సహా నూటొక్క దేవతలు
- వృక్షాలు తొలగించకుండానే నిర్మాణం
- నేడు ప్రారంభం



రాహు,కేతువుల విగ్రహాలు



అమ్మవారి మూలవిరాట్..



సుబ్రహ్మణ్య స్వామి

నక్కపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాకలోని గూడుపమ్మ ఆలయం ఇకపై శక్తిపీఠంగా భక్తులకు దర్శనమివ్వనుంది. ఎంతో చరిత్ర గల రేబాక గూడుపమ్మ మండలంలోని మెరక గ్రామాల ప్రజలకు ఇలవేల్పుగా చెబుతుంటారు. గడచిన పదేళ్లల్లో ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. ఆలయ ధర్మకర్త, గ్రామ మాజీ సర్పంచ్ గొట్టుముక్కల శ్రీహరిరాజు అమ్మవారు కొలువైన చోటే శక్తిపీఠాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందుకుగానూ 2020 నవంబరులో క్షేత్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం శక్తిపీఠం పూర్తయింది. వనాల మధ్య అద్భుతమైన ఆలయాన్ని, ఉపాలయాలను నిర్మించారు. ఆలయ గర్భగుడి వున్నచోటే అమ్మవారి మూలవిరాట్ వుండేలా ఏర్పాట్లు చేశారు. భారీ వృక్షాలు కాని, వాటి కొమ్మలు కానీ తొలగించకుండా చెట్ల మధ్యే అపురూపమైన ఆలయం నిర్మించారు.



ఆలయ ప్రాకారంపై దర్శనమిస్తున్న నూటొక్క దేవతల రూపాలు

ఎన్నో విశిష్టతలకు నిలయం

రేబాకలో కొత్తగా నిర్మించిన శక్తిపీఠం ఎన్నో విశిష్టతలకు నిలయమని చెప్పాలి. ప్రధాన ఆలయంలో నవదుర్గలను ఏర్పాటు చేశారు. ప్రధాన ఆలయం చుట్టూ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవుడు, వనదేవత, నాగదేవత, అష్టాదశ శక్తిపీఠాలు, సరస్వతీదేవి మందిరం, అష్టలక్ష్మి దేవతల మందిరం, ఆలయ ఆవరణలో నూటొక్క దేవతల రూపాలు, రాహు, కేతు విగ్రహాలు, గ్రామదేవతలు ఇలా ఎన్నో అద్భుతమైన ఉపాలయాలను నిర్మించారు. ఫిబ్రవరి 7వ తేదీన శక్తిపీఠం ప్రారంభించనున్నారు. దాతల సహకారంతో రూ.కోటిలకు పైగా వ్యయంతో ఈ క్షేత్రాన్ని నిర్మించారు.



చెట్లు తొలగించకుండా కొత్తగా నిర్మించిన ఆలయం

అమ్మవారి దయ వల్లే..

గొట్టుముక్కల శ్రీహరి రాజు, ఆలయ ధర్మకర్త



మా గ్రామంలో వున్న గూడుపమ్మకి 300 సంవత్సరాలకు పైగా చరిత్ర వుంది. ఈ ప్రాంత ప్రజలకు అమ్మవారంటే ఎంతో నమ్మకం. కొవిడ్ మహమ్మారి వల్ల గ్రామంలో ఏ ఒక్కరికి హాని కలగలేదంటే అమ్మవారి దయే. రేబాకకు ఒక ప్రత్యేకత వుండాలనేది నా జీవిత కల. ఎంతో మంది దాతలు సహకారం, అమ్మవారి ఆశీస్సుల వల్లే ఈ క్షేత్ర నిర్మాణం ఏ ఆటంకం లేకుండా జరిగింది.

స్టెమీ రూమ్ సేవలపై అవగాహన



స్టెమీ రూమ్‌పై అవగాహన కల్పిస్తున్న సూపరిటెండెంట్ డాక్టర్ శిరీషా

నక్కపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక 50 పడకల ఆస్పత్రిలో అందుబాటులో వున్న స్టెమీ రూమ్ సేవలపై గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీషా రోగులకు అవగాహన కల్పించారు. గుండెపోటు వచ్చినా.. ఆ లక్షణాలు కనబడిన రోగులను తమ ఆస్పత్రికి తీసుకొస్తే, సకాలంలో అత్యున్నత వైద్యసేవలందిస్తామని చెప్పారు. ఈసీజీ, ఇతర పరీక్షలు చేసి కేజీహెచ్ కార్డియాలజీ విభాగానికి ఆన్‌లైన్‌లో పంపిస్తే, నిమిషాల్లో అక్కడి నుంచి తమకు సమాచారం వస్తుందన్నారు. గుండెపోటు వచ్చినట్టు నిర్ధారించాక, లేదా గుండెపోటు లక్షణాలేనని నిరూపితమైతే రూ. 40 వేలు విలువైన టెనెక్ప్లేజ్ ఇంజక్షన్ ఇస్తామని చెప్పారు. ఇలా ఎంతో మంది ప్రాణాలతో బయటపడ్డారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేత అప్పలరాజు, వైద్యాధికారులు జయలక్ష్మి, సంతోశ్‌కుమార్, ఈశ్వర్ ప్రసాద్, ఆస్పత్రి సిబ్బంది ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడిగా సాయికృష్ణ

మునగపాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికలు పరిశీలకుడుగా అధిష్ఠానం బాధ్యతలు అప్పగించిందని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ తెలిపారు. కూటమి అభ్యర్థి గెలుపు కోసం పార్టీ శ్రేణులతో కలిసి శక్తి వంచన లేకుండా కృషిచేస్తానని చెప్పారు. బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

సీతారాముల విగ్రహాలకు యాగశాలలో పూజలు



విగ్రహాలను మోసుకొస్తున్న తిమ్మరాజుపేట సర్పంచ్

మునగపాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజోతి): మండలంలో తిమ్మరాజుపేటలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ప్రతిష్ఠ చేయనున్న విగ్రహాలకు గురువారం యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవీ ఉపాసకులు వెలవలపల్లి కోటేశ్వర శర్మ, శివాచార్య శాస్త్రోక్తంగా పూజలు, హోమాలు మొదలు పెట్టారు. ఆవిష్కరణ చేయనున్న సీతారామలక్ష్మణ, ఆంజనేయ, విఘ్నేశ్వర, శ్రీకృష్ణుడు విగ్రహాలకు యాగశాలలో పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడులో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కూడా స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఆలయం వద్ద హోమం, ప్రత్యేక పూజలు జరిపించారు. తరువాత స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయం వద్ద తీర్థం సాగింది. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, పలు పార్టీల నాయకులు గుర్రం రామకృష్ణ, అద్దేపల్లి నూకినాయుడు, లక్ష్మీనారాయణ, మత్తి కార్తీక్, నాగంబోయిన శ్రీనివాసరావు, నక్కా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సంతపాలెంలో ఘనంగా సీతారాములవారి తీర్థం

రాంబిల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు పంచాయతీ శివారు సంతపాలెంలో గురువారం సీతారాములవారి తీర్థం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు సీతారాములను దర్శించి పూజలు చేశారు. గ్రామ నాయకులు చినబాబు, తదితర పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

తమలపాకు సాగులో యాజమాన్య పద్ధతులతో నష్టాల నివారణ

- కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.శైలజ



సత్యవరంలో తమలపాకుల రైతుల శిక్షణకార్యక్రమంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శైలజ

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్ర.జ్యోతి): తమలపాకుల తోటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులను సాధించి నష్టాలను నివారించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త కె.శైలజ అన్నారు. మండలంలోని సత్యవరంలో గురువారం తాండవ వాలీ ఉద్యానవన రైతు ఉత్పత్తిదారుల సంఘం, ఎలమంచిలి బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో తమలపాకుల రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమలపాకుల సాగులో తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులు వివరించారు. తెగుళ్లను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే ఆధునిక రకం తమలపాకుల వంగడం వేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చన్నారు. ప్రతి ఏటా భూసార పరీక్షలు జరుపుకోవాలన్నారు. తాండవ రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో జి. సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వ పథకాలు, రాయితీలు సులభంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎం.శివ, శ్రీహరి రావు, ఏవో పి.ఆదినారాయణ, సర్పంచ్ సఖిలేటి రాము, తాండవ వాలీ ఉద్యానవన రైతుల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు విశ్వనాధుని సత్యనారాయణ డైరెక్టర్లు సూర్యనారాయణ, నూకరాజు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

పాయకరావుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కులో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం పార్కులోవిగ్రహం ధ్వంసం చేసిన ప్రదేశంలో వైసీపీ నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ అన్ని వర్గాలకు చెందినవారని, అటువంటి మహోన్నతమైన వ్యక్తి విగ్రహాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. దీనిపై పోలీసులు పూర్తివిచారణచేసి నిందితులను చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, వైసీపీ నాయకులు ధనిశెట్టి బాబూరావు, దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబి, జగతా శ్రీను, దోమాడ సుందరరావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్ర జేఏసీ మహిళా కన్వీనర్ డాక్టర్ మంచా నాగమల్లేశ్వరి తదితరులు పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన ప్రదేశాన్ని గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, కువల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడ్ని ఆదుకోవాలంటూ స్పాన్‌లైన్ ఫార్మా ఎదుట ఆందోళన



కంపెనీ గేటు ముందు బాధితుడును మంచంపై వేసి నిరసన తెలుపుతున్న దృశ్యం

రాంబిల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్ఈజడ్‌లోని స్పాన్‌లైన్ ఫార్మా కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తూ ప్రమాదానికి గురై మంచానికి పరిమితమైన నాగల ఆనంద్ (26)కు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు కంపెనీ ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఈ ఆందోళనకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 24న ఆనంద్ కంపెనీలో లిఫ్టు పని చేస్తుండగా రోప్ తెగిపోవడంతో ఎడమ కాలు కిందిభాగం నుజ్జునుజ్జు అయిందన్నారు. కంపెనీ యాజమాన్యం కొంతమేర వైద్యం చేయించి వదిలేయడంతో ఆయన కుటుంబం కంపెనీ గేటు ముందు ఆందోళన చేసిందన్నారు. ఆనంద్ కోలుకొనేంత వరకు మెరుగైన వైద్యంతోపాటు పూర్తి వేతనం ఇవ్వాలని, కోలుకున్న తరువాత ఆనంద్‌కు కంపెనీలో చేయగల పని ఇచ్చి ఆదుకోవాలన్నారు. లేదంటే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ. 50 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబ జీవనాధారమైన ఆనంద్ విధి నిర్వహణలో ప్రమాదానికి గురై మంచాన పడితే మా గతి ఏమిటని కుటుంబీకులు కన్నీరుమున్నీరయ్యారు. కంపెనీ యాజమాన్యం స్పందించకుంటే లేబర్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, కంపెనీ గేటు ముందు ఆందోళన చేస్తామని దేముడునాయుడు హెచ్చరించారు. ఆందోళనలో సీఐటీయూ నేత వై.రాము, ఆనంద్ భార్య అనురాధ, కుటుంబీకులు పోలారపు పారునాయుడు, నాగల దుర్గారావు, కుందిరి అప్పలరాజు,నాగల అరుణ్‌కుమార్, వడిశల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

ఎలమంచిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానామస్)లో గురువారం మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ విడుదల చేశారు. నేక్ ఏ గ్రేడుతోపాటు అటానామస్ హోదా దక్కడంతో కళాశాల ఆవరణలో అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులతో కలిసి పరీక్షా ఫలితాలను విడుదల చేశారు.

పాడి రైతులకు బీమా సౌకర్యం

అచ్యుతాపురం, ఫిబ్రవరి 6: పాడి రైతులకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తున్నామని విశాఖ డెయిరీ ఎంజేపురం పాల సంఘం అధ్యక్షుడు సేనాపతి వంశి తెలిపారు. పాడి రైతు గొర్లె నాగేశ్వరరావు ఆవు చనిపోయినందున రూ.50 వేల బీమా చెక్కుని ఆయన గురువారం అందజేశారు. కార్యక్రమంలో పీలా కాశిబాబు, భీముని నాయుడు, బుదిరెడ్డి చిరంజీవి, వజ్రపు సూరిబాబు, బొండా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

హలో మాదిగ, చలో హైదరాబాద్‌ని విజయవంతం చేయాలి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఏడున జరిగే హలో మాదిగ, చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకినాడ కనకేశ్వరరావు పిలుపునిచ్చారు. ఎస్సీల ఏబీ,సీడీ వర్గీకరణకు లక్ష డప్పులు, వేల గొంతులతో మాదిగలు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

15లోగా పంట నమోదు చేసుకోవాలి

- వ్యవసాయశాఖ ఏడీ ఎం.రామారావు



క్షేత్రస్థాయిలో పంట నమోదును పరిశీలించిన రామారావు

మునగపాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వరి పంట వేసిన రైతులు ఈనెల 15వ తేదీలోగా ఈ-పంట నమోదు చేసుకోవాలని అనకాపల్లి వ్యవసాయ ఏడీ ఎం.రామారావు పిలుపునిచ్చారు. మండలంలో మునగపాక, వాడ్రాపల్లి, గంటవానిపాలెం గ్రామల్లో ఈ-పంట నమోదుపై గురువారం సూపర్ చెక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో వేసిన ప్రతి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసిన పంటకు అధికారికంగా గుర్తింపు ఉంటుందని, రైతు పండించిన ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు అర్హత పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

మునగపాక, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అనుబంధ విభాగాలు ఎలమంచిలి నియోజకవర్గ అధ్యక్షులను పార్టీ నియమించిందని జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడులు తెలిపారు. వైసీపీ బీసీ సెల్‌కు బొడ్డేడ చెల్లయ్యానాయుడు, ఎస్సీ సెల్‌కు మందా రాము, విద్యార్థి విభాగానికి చదరం అప్పలనాయుడు, అంగన్‌వాడీలకు పల్లెల సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌టీయూసీకి సుందరపు నీలకంఠస్వామి, సోషల్ మీడియాకు పోలవరపు రమణ ప్రసాద్, ఐటీకి చేకూరి రామరాజు, ఇంటలెక్చువల్ ఫోరంనకు పిట్టా చిన మంగారెడ్డిని నియమించారన్నారు.

వైసీపీ యూత్ అధ్యక్షుడిగా జగ్గారావు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎలమంచిలి నియోజక వర్గం యూత్ విభాగం అధ్యక్షుడిగా తిమ్మరాజుపేటకు చెందిన శరగడం జగ్గారావు నియమితులయ్యారు. జగ్గారావు ఇంత వరకు మండల యూత్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

పలు సంపద కేంద్రాల తనిఖీ



బోదిగల్లం సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు, సర్పంచ్ ముస్నీషాబేగం

నక్కపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం, ఉపమాక పంచాయతీల పరిధిలో సంపద కేంద్రాలను గురువారం మధ్యాహ్నం ఎంపీడీవో సీతారామరాజు తనిఖీ చేశారు. చెత్త నుంచి సంపద తయారీపై గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు. సేంద్రియ ఎరువుల ఉత్పత్తులను పెంచడం వల్ల పంచాయతీలకు అదనపు ఆదాయం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ముస్నీషాబేగం, ఈవోపీఆర్‌డీ శ్రీను, సెక్రటరీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు పట్ల అప్రమత్తంగా ఉండాలి

- వైద్యవిధానపరిషత్ ఆస్పత్రి డాక్టర్ గోదాదేవి

కోటవురట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యవిధానపరిషత్ ఆస్పత్రి డాక్టర్ గోదాదేవి సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలకు స్టెమి గుండెపోటుపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరికైనా గుండెపోటు లక్షణాలు, ఛాతిలో నొప్పి, ఎడమపక్క లాగడం, ఆకస్మికంగా ఆయాసం రావడం వంటివి కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుతవ్వఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఈసీజీ తీసిన తర్వాత ఎటువంటి అనుమానాలు ఉంటే వెంటనే కేజీహెచ్ డాక్టర్లను సంప్రదిస్తామన్నారు. వారి గుండెపోటు అని నిర్ధాస్తే ఆస్పత్రిలో మొదటి గంటలోనే రూ.45 వేలు విలువ గల ఇంజక్షన్ ఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా స్థాయి ఆస్పత్రులకు తరలించడం జరుగుతుందన్నారు. గ్యాస్టిక్ నొప్పిని నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బిందుశ్రీ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

- జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న లోవరాజు

కోటవురట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అనకాపల్లి జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సూజాత ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లోవరాజు మాట్లాడుతూ బాలవివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం పోక్సో చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చిందన్నారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం



అచ్యుతాపురం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం-గాజువాక రోడ్డులోని మరిడిమాంబ అమ్మవారి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అచ్యుతాపురం, మోసయ్యపేట, రామన్నపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, పులిహోర ఉచితంగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, రామన్నపాలెం సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, చోడపల్లి ఎంపీటీసీ సభ్యుడు లాలం శ్రీనివాసరావు, లాలం సత్తిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పందుల స్వైరవిహారం



ఎలమంచిలిలో సంచరిస్తున్న పందులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాసాల మధ్య వరాహాలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ ప్రజారోగ్య శాఖ అధికారులు పందుల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇటీవల కాలంలో పట్టణంలో పందుల సంచారం తీవ్రరూపం దాల్చింది. పట్టణంలోని కొత్తపేట, మిలట్రీ కాలనీ, గాంధీనగర్, కాకివానివీధి, ధర్మవరం, కొక్కిరాపల్లి, పెదపల్లి, తదితర పలు ప్రాంతాల్లో పందుల సంచారం అధికంగా ఉంది. పట్టణంలో రెండున్నర కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న యానాద్రి కాలువ పందుల ఆవాసకేంద్రంగా నిలుస్తున్నది. నివాస ప్రాంతాల వద్ద పందులు సంచరిస్తుండడంతో వీటి కారణంగా ఎటువంటి అనారోగ్యాలకు గురవుతామోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. పట్టణ ప్రజారోగ్య శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించకుండా పందుల సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఘనంగా కృష్ణాదేవిపేట జూనియర్ కళాశాల ఫేర్‌వెల్



నృత్యం చేస్తున్న కళాశాల విద్యార్థులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ ఆనందోత్సాహాల నడమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తేవాలని కోరారు. ఇప్పటివరకు కళాశాల ఉత్తీర్ణతలో జిల్లాలో గుర్తింపు పొందిందని, దాన్ని కాపాడాలని విద్యార్థులను కోరారు. ఇంటర్ పరీక్షల్లో గతేడాది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సంపాదించి విద్యార్థులకు నగదు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్యాలు ఉత్సాహాన్ని నింపాయి. కార్యక్రమంలో అధ్యాపకులు చిన్ని, గోవిందు, శ్రీనివాసు, అంకిరెడ్డి శ్రీనివాసరావు, రామకృష్ణ, నాగేశ్వరి, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏడు గ్రామాల్లో అడివిరాజులబాబు పండగ



బుచ్చన్నపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడు గ్రామాల్లో అడివిరాజులబాబు పండగను స్థానికులు ఘనంగా నిర్వహించారు. బుచ్చన్నపాలెం, పైడిపాల, పెద్దిపాలెం, చామంతిపురం, పాపయ్యపాలెం, తూటిపాల, తాడపాల, నారాయణ రాజుపేట గ్రామాల్లో అడివిరాజుల బాబు పండగను నిర్వహించారు. ఉదయం నుంచి ప్రజలు ఆలయాలకు చేరుకొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

లచ్చన్నపాలెంలో సీతారాముల విగ్రహాల ఊరేగింపు

మాకవరపాలెం ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నపాలెంలో సీతారాముల విగ్రహాలను గురువారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు పోతల రాంబాబు మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన రామాలయంలో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ ఉందన్నారు. గ్రామంలో రూ.50లక్షలతో రామాలయాన్ని నిర్మించామన్నారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భజనలు, చిడతలు డాన్సు, సన్నాయి నొక్కులతో భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.

ఇంటి స్థలం వివాదంలో ఇరు వర్గాలపై కేసు

గొలుగొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం వివాదంలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామారావు గురువారం తెలిపారు. మండలంలోని సాలికమల్లవరం గ్రామం ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు ఇంటి స్థలం విషయమై బుధవారం రాత్రి కర్రలతో దాడులకు దిగారని తెలిపారు. దీనిపై ఇరువర్గాలు చేసిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. ఒక వర్గానికి చెందిన మాతె భవాని, రాజబాబు, దేముడు, మరో వర్గానికి చెందిన మాతె గంగరాజు, వరహాలపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

నిలిచిన సాలికమల్లవరం-వెంకటాపురం రోడ్డు పనులు

- పది రోజుల క్రితం పనులు ప్రారంభం
- అనుమతులు లేవని అడ్డుకున్న అటవీ శాఖ అధికారులు

గొలుగొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో సాలికమల్లవరం-వెంకటాపురం రోడ్డు పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు పనులు వెంకటాపురంలో పది రోజుల క్రితం ప్రారంభమయ్యాయి. గురువారం రోడ్డు పనులను అటవీ శాఖ అధికారులు పరిశీలించారు. అనుమతులు లేకపోవడంతో పనులు ఆపేయాలని అటవీ శాఖ చెప్పడంతో పంచాయతీరాజ్ డీఈఈ పనులను నిలిపేశారు. వివరాల్లోకి వెళితే..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నాతవరం, గొలుగొండ మండలాలకు లింకు రోడ్డును ఏర్పాటు చేశారు. సాలికమల్లవరం నుంచి వెంకటాపురం గ్రామం వరకూ రెండున్నర కిలోమీటర్ల రోడ్డుకు అటవీశాఖ అనుమతులు లేకపోవడంతో అప్పట్లో నిలిచిపోయాయి. ఈ రోడ్డు పనులు వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సాలికమల్లవరం నుంచి వెంకటాపురం వరకూ రెండున్నర కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.65 లక్షలు మంజూరయ్యాయి. దీంతో రోడ్డు పనులు పది రోజుల క్రితం వెంకటాపురం గ్రామం నుంచి ప్రారంభించారు. అర కిలోమీటరు రెవెన్యూ భూమి కావడంతో పనులు చేపట్టారు. రెవెన్యూ భూమిలో ప్రస్తుతం గ్రావెలు రోడ్డు



రెవెన్యూ భూమిలో రోడ్డుకు గ్రావెల్‌తో వేస్తున్న దృశ్యం

పనులు జరుగుతున్నాయి. గురువారం నర్సీపట్నం ఫారెస్ట్ సెక్షన్ రేంజర్ లక్ష్మీనర్సు, పీఆర్ డీఈఈ ఈశ్వరరావు రోడ్డు పనులు పరిశీలించారు. ఇక్కడ ఫారెస్ట్ అనుమతులు వచ్చేవరకూ రోడ్డు పనులు నిపివేయాలని పీఆర్ డీఈని అటవీ రేంజర్ లక్ష్మీనర్సు కోరారు. రోడ్డు నిర్మాణానికి చెందిన భూమి ఫారెస్ట్‌కు చెందితే.. అనుమతులు కోసం దరఖాస్తు చేస్తామని డీఈ తెలిపారు.

కొనసాగుతున్న రెండు గ్రామాల ప్రజల ఆందోళన

- పయనీరు కంపెనీ లారీలకు బ్రేకు
- సర్పంచులతో లారీ ఓనర్స్ చర్చలు విఫలం
- ఖాళీ లారీలను విడిచిపెట్టిన ఆందోళనకారులు



సర్పంచులతో చర్చలు జరుపుతున్న లారీ ఓనర్స్

మాకవరపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పయినీర్ (అన్‌రాక్)యాజమాన్యం దిగిరాకపోవడంతో రెండో రోజూ రెండు గ్రామాల సర్పంచులు ఆందోళన కొనసాగించారు. బాక్సైట్ ముడిఖనిజాన్ని తలరించే లారీలను బుధవారం వేకువజాము నుంచి శెట్టిపాలెం, భీమబోయినపాలెం సర్పంచులు అల్లు రామునాయుడు, రుత్తల నందకిషోర్ ఆధ్వర్యంలో నిలిపివేశారు. గురువారం ఉదయం లారీల ఓనర్స్ రెండు గ్రామాల సర్పంచులతో చర్చలు జరిపారు. అయితే లారీ ఓనర్స్‌తో గాని డ్రైవర్సుతో గాని ఎటువంటి గొడవలు లేవని, అన్‌రాక్ యాజమాన్యం రాకుంటే లారీలను ఇక్కడ నుంచి వదలిపెట్టేది లేదని సర్పంచులు తెగేసి చెప్పారు. దీంతో చేసేది లేక లారీ ఓనర్స్ అక్కడ నుంచి వెళ్లిపోయారు. సుమారు 120 లారీలు రోడ్డుకు ఇరువక్కల నిలిచిపోయినా అన్‌రాక్ యాజమాన్యం కనీసం పట్టించుకోలేదని సర్పంచులు ఆరోపించారు. రోడ్డు వెడల్పు చేయాలని, అధిక లోడుతో లారీలు రాకూడదని వారు డిమాండ్ చేశారు. అయితే ఖాళీ లారీలతోపాటు బాక్సైట్ ముడిఖనిజంతో ఉన్న లారీలను వెనక్కి తీసుకొని పోవాలని సర్పంచులు స్పష్టం చేశారు. అయితే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదరనాయుడు పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. అలాగే కంపెనీ నుంచి బాక్సైట్ పౌడర్‌తో వెళ్లే లారీలను తిరగన్వీమని సర్పంచులు ప్రకటించారు. ఆందోళనలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, జోగిపాత్రుడు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించిన న్యాయమూర్తి

నర్సీపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని స్థానిక న్యాయస్థానం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి. షియాజ్‌ఖాన్ సందర్శించారు. గురువారం ఆస్పత్రిలో చిన్న పిల్లలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. సత్వర వైద్య సేవలకు అవసరమైన అన్ని సౌకర్యాలు, మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అన్ని విభాగాలను తనిఖీ చేశారు.



ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

ఏఎల్‌పురం హైస్కూల్‌లో తాగునీటి బోరు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం ఏఎల్‌పురం జడ్పీ హైస్కూల్‌లో గురువారం తాగునీటి బోరు వేశారు. సుమారు 400 అడుగుల వరకు బోరు తవ్వారు. ఈ హైస్కూల్‌లో 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడుతున్నదని ఉపాధ్యాయుల ఫిర్యాదుతో జిల్లా అధికారులు హైస్కూల్‌లో బోరు వేయించారు. దీంతో హైస్కూల్‌లో తాగునీటి సమస్య తీరనుంది. బోరు వేయడం పట్ల విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా అనంతేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేశ్ దంపతులు

నర్సీపట్నం/అర్బన్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లిలో ఐశ్వర్యాంబిక సహిత అనంతేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం రెండో రోజు నేత్రపర్వంగా నిర్వహించారు. గురువారం ఉదయం గణపతి పూజ, క్షీరాభిషేకం, జలాధివాసం, ధాన్యాధివాసం, నీరాజనం, హోమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శుక్రవారం శిలా విగ్రహ, శిలా ధ్వజ, యంత్ర స్థాపన ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

అడవిరాజులబాబు వనంలో ప్రత్యేక పూజలు

నాతవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : స్థానిక అడవిరాజులబాబు ఆలయం 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు రాజులబాబుని దర్శించుకుని పూజలు చేశారు. మహిళలు వివిధ పుష్పాలతో ఆలయాన్ని అలంకరించారు. అలాగే ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ, టీడీపీ మహిళ నాయకురాలు పారుపల్లి కృష్ణవేణి, టీడీపీ గ్రామ అధ్యక్షులు శెట్టి నానాజి పాల్గొన్నారు.

పాకలపాడులో దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

గొలుగొండ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకలపాడులో గురువారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పిల్లి చిన్నోడు, గండిబోయిన రాము, నూకాలమ్మ ఆర్థిక సాయంతో అమ్మవారి ఆలయాన్ని నిర్మాణం చేపట్టారు. గురువారం విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని చేపట్టారు. మూడు రోజులుగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్ర, భక్తులు పాల్గొన్నారు.

రిటైరైన పోస్టుమన్‌కు ఘన సన్మానం



గవరరాజును సత్కరించిన పోస్టల్ ఉద్యోగులు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏఎల్‌పురంలో 45 ఏళ్లు పోస్టుమన్‌గా విధులు నిర్వహించిన గొంప గవరరాజు గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోస్టాఫీసులో పోస్టుమాస్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో గవరరాజును సన్మానించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు అంబటి శ్రీనివాస్, గొంప శేఖర్, పైల కృష్ణ, గవరరాజు కుటుంబీకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభతరం


- జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) బాలకృష్ణ



మాట్లాడుతున్న బాలకృష్ణ

మాడుగుల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గతంలో కంటే సులభతరంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు అయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్టు రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) జి. బాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. రిజిస్ట్రేషన్లు జరుపుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో కన్నా రిజిస్ట్రేషన్లు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఇకనుంచి లేఖర్లే అవసరం లేదని, ఎవరికి వారే రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని చెప్పారు. ఆస్తి కొనుగోలుదారులు చలానా తీసిన వెంటనే అన్నీ ఆన్‌లైన్‌లో డేటా పొందుపరుస్తారన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విక్రయించే స్టాంపుల్లో తప్పులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే తప్పిదాలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సముంద్రంనకు సంబంధించి జీతాలు ఏడాదిగా కాకపోవడంపై ప్రశ్నించారు. సాంకేతిక సమస్య నెలకొనడంతో ఈ సమస్య నెలకొందని గుర్తించి, రెండు రోజుల్లో ఆ సమస్య పరిష్కరిస్తామని డీఐజీ తెలిపారు. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ కె మన్మధరావు, డీఐజీ వెంట విశాఖ జిల్లా రిజస్ట్రార్ వెంట ఉపేంద్ర, స్థానిక సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తం ఉన్నారు.

బోధన సామర్థ్యంతో ఉన్నత విద్యా ప్రమాణాలు




ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కోఆర్డినేటర్ నీతిక

రోలుగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకుని, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో చదువు నేర్పించాలని టీచ్ టూల్ జిల్లా కోఆర్డినేటర్ నీతిక పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో టీచ్ టూల్ అబ్జర్వర్స్‌కు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో మంచి అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేయాలన్నారు. టీచ్ టూల్‌పై పట్టు సాధించాలని కోరారు. అనంతరం టీచ్ టూల్స్ అబ్జర్వేషన్‌లో ఉత్తమంగా నిలిచిన సీఆర్పీ సతీశ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమలో ఎంఈఓ జగ్గారావు, నోడల్ హెచ్‌ఎంలు శెట్టి మోహన్‌రావు, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి కేశవ స్వామి కల్యాణ ఉత్సవాలు

చోడవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ శ్రీ కేశవ స్వామి కల్యాణ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 13 వరకూ కొనసాగే ఈ ఉత్సవాలు ఏటా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు.



శ్రీదేవిభూదేవి సమేత కేశవ స్వామి

నేడు గౌరీ పరమేశ్వరుల ముగింపు ఉత్సవాలు

రోలుగుంట: మండల కేంద్రంలో గౌరీ పరమేశ్వరుల తీర్థ మహోత్సవాల్లో భాగంగా ముగింపు ఉత్సవాలను శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ఛైర్మన్ సుర్ల రామకృష్ణ తెలిపారు. సాయంత్రం ఈ ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తేనె మంచుతో జీడి మామిడికి ముప్పు

- ఆందోళన చెందుతున్న రైతులు



బుడ్డిబంద గ్రామంలో జీడిమామిడి తోటలను కప్పేసిన మంచు

రావికమతం ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న తేనె మంచుతో జీడిమామిడి తోటలకు నష్టం చేకూరుతోంది. ఉదయం 8.30 గంటల వరకు దట్టమైన మంచుతో పాటు కొద్దిపాటి చినుకుల్లా పడి నేల తడిసిపోతోంది. జీడిమామిడి చెట్లపై తేనే తరహాలో అంటుకుంటోంది. గత శనివారం నుంచి రోజూ ఉదయం ఇదే విధంగా మంచు పడుతుండటంతో పూత మాడిపోతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పూత, పిందేతో ఉన్న పంటకు ఈ మంచు నష్టం చేకూర్చుతుందని వాపోతున్నారు. మంచు వల్ల పూత నల్లగా మారుతోందని, మరో నాలుగైదు రోజులపాటు ఇలాగే పడితే పంట పూర్తిగా పోతుందని చెబుతున్నారు. ఇప్పటికే ఈ మంచు ప్రభావానికి పూత మాడి పిందే రాకుండా పోయిందని వాపోతున్నారు. అప్పులు చేసి ఇప్పటికే రెండుసార్లు పురుగు మందులు పిచ్చికారి చేశారు.దీంతో పూత వస్తున్న తరుణంలో మంచు దెబ్బతీస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. గతేడాది టీ దోమ వలన జీడి మామిడి పంటకు నష్టం వాటిల్లగా ఈ ఏడాది తేనె మంచు నష్టవాటిల్లుందన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ సమాచార హక్కు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం. వాసుదేవరావు పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో గురువారం సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతీ పౌరుడు ఎలాంటి సమాచారం పొందవచ్చునని, దానికి ఏ వి ధంగా అర్జి పెట్టుకోవాలనే దానిపై వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

10న తలనీలాలు, కొబ్బరి చిప్పలకు వేలం

రావికమతం, ఫిబ్రవరి 6,(ఆంధ్రజ్యోతి): కల్యాణపులోవ పోతురాజుబాబు, పెద్దింటమ్మ వార్లకు ఈనెల 26 నుంచి 28 వరకు మహాశివరాత్రి పుష్కరించుకుని నిర్వహించనున్న తిరునాళ్ల సందర్భంగా భక్తులు సమర్పించే కొబ్బరి చిప్పలు, తలనీలాలకు ఈనెల 10న మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు దేవాదాయ శాఖ ఈఓ కిరణ్మయి తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు వేలం వేయగా, గతంలో కంటే తక్కువ మొత్తం పాటదారులు వేలం పాడారన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 10న తిరిగి వేలం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

కోళ్ల పరిశ్రమల పరిసరాల్లో పరిశుభ్రతతో వ్యాధులు దూరం

చీడికాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):కోళ్ల పరిశ్రమల పరిసరాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఖండివరం పశువైద్యాధికారి ఎ.గణేశ్‌కుమార్ కోరారు. మండల పరిధి బి.సింగవరంలో ఉన్న కోళ్ల పరిశ్రమను గురువారం ఆయన పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోళ్లకు ఎటువంటి వైరల్ వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. అలాగే పరిశ్రమచుట్టూ రోజూ బ్లీచింగ్ చల్లుకోవాలన్నారు. ఆయనతోపాటు పశువైద్యసిబ్బంది ఎం.శ్రీనివాసరావు, శరగడం ధర్మరాజు తది తరులు పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

రోలుగుంట, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): జె.నాయుడుపాలెంలో కొండకాలువను ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్న కాళ్ల శ్రీనివాసరావు, గొర్రపల్లి రాములపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన కాళ్ల రమణమ్మ, కాళ్ల కన్నబాబు, కాళ్ల రవికుమార్ తదితరులు గురువారం తహసీల్దార్ నాగమ్మకు ఫిర్యాదు చేశారు. సర్వే నెం 179/2లో ప్రభుత్వ భూమిలో ఉన్న కాలువను ఆక్రమించారన్నారు. దీంతో వర్షాకాలంలో కాలువలోని నీరంతా ఇళ్లల్లోకి చేరి, తీవ్ర ఇబ్బందులు పడతామని వారు ఆందోళన వ్యక్తంచేశారు.

ఖండివరంలో ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం



పరుగు పోటీలో దౌడు తీస్తున్న ఎద్దులు

చీడికాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖండివరంలో గురువారం శ్రీ కోదండరామ ఆంజనేయస్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాస్వామివారిని మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి గవిరెడ్డి జగన్నాధం, గ్రామ పెద్దలు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్ల పరుగుపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు సుమారు 22బండ్లు రాగా, వీటిలో గెలుపొందిన వాటికి రూ.20వేలు నుంచి రూ.వెయ్యి వరకు తొమ్మిది బహుమతులను గ్రామపెద్దల చేతుల మీదుగా అందించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తీర్థానికి భారీగా భక్తులు తరలివచ్చారు.

తామరబ్బ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలి: సీపీఎం

దేవరాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరబ్బ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేసి హాస్టల్ సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తామరబ్బ పంచాయతీలో 9 పాఠశాలలు, చింతలపూడి పంచాయతీ పరిధిలో 11 పాఠశాలు ప్రాథమిక పాఠశాల ఉన్నాయన్నారు. వీటిలో ఐదో తరగతి పూర్తయిన తరువాత ఉన్నత చదువులకు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఫలితంగా గిరిజన విద్యార్థులు అర్థాంతరంగా చదువులు నిలిచి పోతున్నాయని వెంకన్న ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండలకార్యదర్శి బి.టి.దొర, ఈశ్వరరావు, శంకరరావు, దొంగబాబు పాల్గొన్నారు.

షార్టు సర్క్యూట్‌కు పాన్‌షాప్ దగ్ధం

దేవరాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడలో పాన్‌షాప్ విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌కు దగ్ధమైంది. వివరాలివి.. గ్రామానికి చెందిన బుగత రమణమ్మ పాన్‌షాపులో గురువారం ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రూ. 50 వేల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. జీవనోపాధి కోల్పోడంతో ఆమె ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బాధితురాలిని తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరీ కడింనాగేశ్వరరావు పరామర్శించారు.

గోవాడ షుగర్స్‌లో క్రషింగ్ పునరుద్ధరణ

చోడవరం, ఫిబ్రవరి6(ఆంధ్రజ్యోతి): బగాస్ కొరత, సాంకేతిక అవాంతరాలతో మంగళవారం రాత్రి ఆగిపోయిన గోవాడ షుగర్స్ క్రషింగ్ బుధవారం అర్ధరాత్రి తిరిగి పునఃప్రారంభమైంది. 24 గంటల పాటు క్రషింగ్ నిలిచిపోవడంతో ఫ్యాక్టరీకి చెరకు బళ్లు తీసుకుని వచ్చిన రైతులు ఎండీ ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యంతో రైతులు చెరకు బళ్లను యార్డు వద్ద వదిలి వెనుతిరిగిన సంగతి తెలిసిందే. ఫ్యాక్టరీలో తిరిగి క్రషింగ్ పునరుద్ధరణ జరగడంతో యార్డులోని బళ్లను క్లియర్ చేసే పనిలో ఉద్యోగులు నిమగ్నమయ్యారు. ఫ్యాక్టరీలో అవసరమేర బగాస్ నిల్వలు అందుబాటులో లేక క్రషింగ్‌నకు అంతరాయం తలెత్తుతుండడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సరాసరి ఐదు వేల మందికి ఉపాధి పనులు: ఎంపీడీవో

చీడికాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతిరోజూ ఐదువేల మంది వేతనదారులు ఉపాధి పనులకు వచ్చేవిధంగా చూడాలని ఎంపీడీవో హేమసుందరరావు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం వీఆర్పీలతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం 2500 మంది వరకూ ఉపాధి కూలీలు పనులకు వస్తున్నారని, దాన్ని ఐదువేలకు పెంచాలని ఆదేశించారు. ఇప్పటి వరుకు 75శాతం పనులు పూర్తిచేసిన కుటుంబాలకు 100రోజులు పూర్తయ్యేలా పనులు కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో అల్లు గంగునాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ పాత్రుడు పాల్గొన్నారు.

ఎం.అమండ గ్రామ సర్పంచ్ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి జగన్నాధం

దేవరాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.అమండ గ్రామ సర్పంచ్ దాడి జగన్నాథం సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే విధించింది. సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తూ ఆ గ్రామానికి చెందిన గొర్లె గోవింద గత ఏడాది జూన్ 26న ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిగింది. తర్వాత అధికారులు నివేదిక ఆధారంగా సర్పంచిని మూడు నెలలపాటు సస్పెండ్ చేస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ గత నెలలో ఆదేశాలు జారీ చేశారు. ఈఉత్తర్వులపై సర్పంచ్ హైకోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారించిన హైకోర్టు సర్పంచి సస్పెన్షన్‌పైనే విధించింది. దీనిపై నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు కోర్టు గడువు విధించింది.ఈ నేపథ్యంలో మద్దతు దారులతో సర్పంచి జగన్నాథం విలేకరులతో మాట్లాడారు. తాను ఏతప్పు చేయలేదని, ధర్మమే చివరికి గెలుస్తుందన్నారు.ఉపసర్పంచి గంగాధర్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ప్రసాదు,వార్డు సభ్యులు గోవింద, రమణ పాల్గొన్నారు.

శ్రమదానంతో రహదారి మరమ్మతులు



దర్మాపురం నుంచి వెళ్లే రహదారిని బాగుచేస్తున్న గిరిజన యువకులు

సీలేరు, ఫిబ్రవరి 6 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి ధర్మాపురం నుంచి వెళ్లే ప్రధాన రహదారిని గ్రామానికి చెందిన గిరిజన యువకులు శ్రమదానంతో మరమ్మతులు చేపడుతున్నారు. గత సెప్టెంబరు 8న వచ్చిన భారీ తుఫాన్ ప్రభావానికి ధారాలమ్మ ఘాట్ రోడ్డులో దిగువన ఉన్న ధర్మాపురానికి వెళ్లే రహదారంతా కోతకు లోనైంది. దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికి ఐదు నెలలు గడుస్తున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఈ గ్రామస్థులు అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లాలన్నా, సంతలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామంలోని గిరిజన యువత ముందుకు వచ్చి శ్రమదానంతో రహదారిని బాగుచేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ధర్మాపురం గ్రామ రహదారిని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

జీనబాడు అదనపు వసతి గృహం పరిశీలన



వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి స్వామినాయుడు, తదితరులు

అనంతగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల జీనబాడులోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల అదనపు వసతిగృహాన్ని సమగ్రశిక్ష, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ స్వామినాయుడు గురువారం పరిశీలించారు.. ఈ పాఠశాలకు అదనపు వసతిగృహం నిర్మించారు.. వసతి గృహంలో సౌకర్యాలు లేకపోవడంతో దీనిని ప్రస్తుతం వినియోగించడం లేదు. ఈ నేపథ్యంలో కేజీబీవీ-4 కింద కేటాయించేందుకు అమరావతి నుంచి నివేదిక రావడంపై సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి పరిశీలించి, వివరాలను అధికారుల నుంచి తెలుసుకున్నారు.. దీనిపై పూర్తి ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవో కిల్లో బాలాజీ, పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరిని పూర్తి వివరాలను ఇవ్వాలని ఆయన కోరారు. జీనబాడు ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శించిన సమగ్రశిక్ష పీవో స్వామినాయుడు పలు సూచనలు చేశారు. పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్నందున విద్యార్థినులకు అర్థమయ్యేరీతిలో బోధించి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఆదేశించారు.

మార్చి నాటికి చెత్త సంపద కేంద్రాలు పూర్తి: ఈవోపీఆర్‌డీ



ఈవోపీఆర్ఆర్‌డీ రమేశ్

పాడేరురూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలం 26 గ్రామ పంచాయతీల్లో మార్చి నెలాఖరునాటికి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్టు ఈవో పీఆర్‌ఆర్‌డీ ఆర్‌పీఎస్ రమేశ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించేందుకు చెత్త సంపద కేంద్రాలను గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్నట్టు వివరించారు. గ్రామాల్లో చెత్తను క్లాప్ మిత్రల ద్వారా సేకరించి సంపద కేంద్రాలను విజయవంతంగా నిర్వహించి ఆర్థిక వనరులు చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. మండల పరిధిలో 26 పంచాయతీలకుగాను ఇప్పటికే కిండంగి, మినుములూరు, తుంపాడ, కుజ్జెలి, పాడేరు, గొండెలి, చింతలవీధి పంచాయతీలలో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిలో కిండంగి, మినుములూరు, తుంపాడల్లో వినియోగంలో ఉన్నాయన్నారు. అసంపూర్తిగా నిర్మాణాలు జరిగిన నాలుగు కేంద్రాలను ఈనెల 15వ తేదీలోగా వినియోగంలోకి తెస్తామన్నారు.

గ్రామ శివారుకు సెల్ టవర్ తరలించకుంటే ఆందోళన

పెదబయలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలం గోమంగి పంచాయతీ పంగళం గ్రామంలో నిర్మిస్తున్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్‌ను ఊరి శివారుకు తరలించాలని పీసా కమిటి కార్యదర్శి జంపరంగి సునిల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో సెల్ టవర్ నిర్మాణం జరుగుతున్న ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో పూర్తిగా నల్లరాయి ప్రదేశమని, ఇక్కడ సెల్ టవర్ నిర్మాణానికి పీసా కమిటీ అంగికరించదని తక్షణమే ఆ నిర్మాణ పనులు ఆపాలన్నారు. గ్రామాల మధ్యలో సెల్ టవర్లు నిర్మాణంతో మూగ జీవాలు, పక్షులు అంతరించిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తారు. రేడియేషన్ ప్రభావంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని వాపోయారు. అందువల్ల గ్రామ శివారులో టవర్ నిర్మించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పరీక్షల సన్నద్ధతపై అవగాహన

కొయ్యూరు, ఫిబ్రవరి 6 , (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మానసిక వికాసం, పరీక్షల సన్నద్ధతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాజిటీవ్ హెల్త్‌కేర్ సెంటర్ సైకాలజిస్ట్ బి. ఉమామహేశ్వరరావు, స్టీల్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పీకెఎం లక్ష్మీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అధ్యయన నైపుణ్యాలను పెంపొందించడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్, సుమ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం- రాకపోకలకు నరకం

» అధ్వానంగా పరదేశిపాకలు- బంగారమ్మపేట రహదారి

కొయ్యూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు పంచాయతీలకు చెందిన సుమారు 10 గ్రామాలకు సంబంధించి ప్రధాన రహదారి కనీస మరమ్మతులు లేక ప్రజలు నరకం చూస్తున్నారు. పాతకృష్ణాదేవిపేట నుంచి బంగారమ్మపేట, అంతాడ పంచాయతీలకు చెందిన సుమారు పది గ్రామాలకు చెందిన ఈ రహదారి పదేళ్లుగా మరమ్మతులు చేపట్టలేదు.. పాత కృష్ణాదేవిపేట నుంచి పరదేశిపాకలు, బంగారమ్మపేట వద్ద రోడ్డు రాళ్లు తేలి, గోతులతో అధ్వానంగా మారింది. గత ఏడాది కురిసి భారీ వర్షాలకు మరింత దయనీయ స్థితికి చేరింది. ఈ రహదారి ఆధారితంగా రాకపోకలుసాగించే అంతాడ, బంగారమ్మపేట పంచాయతీలకు చెందిన సుమారు పది గ్రామాల వారు కనీసం ద్విచక్ర వాహనాలపై వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. అత్యవసర సమయాల్లో నరకాన్ని చూస్తున్నారు. ఈ రహదారి మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు గత ప్రభుత్వ హయాంలో పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ హయాంలో నెరవేర్చాలని కోరుతున్నారు.



ఎరదేశిపాకలు- బంగారమ్మపేట మధ్య రహదారి

ఎన్‌హెచ్ రహదారి పనులతో దుమ్ము, ధూళి



కె.కోడాపల్లిలో ఇళ్లలోకి వస్తున్న దుమ్ము, ధూళి

జి. మాడుగుల: జాతీయ రహదారి 916ఈ నిర్మాణ పనులతో దుమ్ము, ధూళితో ప్రజలకు అగచాట్లు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం మండలంలో సంతబయలు నుంచి కె.పడాపల్లి వరకు రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. ఈ క్రమంలో పలుచోట్ల కంకర పనులు, ఇరువైపులా గ్రావెల్ వేస్తున్నారు. వాటిపై నీరు చల్లక పోవడంతో దుమ్ము, ధూళి పైకి లేచి రోడ్డుకు ఇరువైపులా ఉన్నఇళ్లలోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. దీనికి తోడు వాహనాల రద్దీతో ఈ సమస్య మరింత అధికంగా ఉంటోంది. జనజీవనానికి అసౌకర్యం కలుగుకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇవేవీ పట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానిక నివాసితులు ఆరోపిస్తున్నారు.

గిరిజన ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలి: ఎమ్మెల్యే



శ్రీకృష్ణుడి విగ్రహానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మకోట పంచాయతీ పూతికవలస ప్రకృతివ్యాలీ ప్రాంగణంలో మహాధ్యానచక్ర- 8 కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.. ధ్యానరత్న రాయ జగపతిరాజు ఆధ్వర్యంలో మహాధ్యానచక్ర విజయవంతంగా సాగుతుండడంపై అభినందించారు. ఏటా ఫిబ్రవరి 2నెల నుంచి 11 వరకు మహాధ్యానచక్ర కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం ప్రాంగణంలో 108 అడుగుల శ్రీకృష్ణుడి విగ్రహానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు తౌటినాయుడు, వైసీపీ నాయకులు కొర్రా సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు..

కాఫీ ధరలు పెంపు : జీసీసీ డీఎం దేవరాజు

పార్చిమెంట్ కిలో రూ.400 అరబిక చెర్రీ రూ. 250, రొబస్టా చెర్రీ రూ.160



డీఎం దేవరాజు

చింతపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సహకార సంస్థ కాఫీ ధరలు పెంచినట్టు స్థానిక డివిజనల్ మేనేజర్ పి. దేవరాజు తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ మార్కెట్ ధరలు ఆధారంగా జీసీసీ ఎండీ కల్పన కుమారి కాఫీ ధరలు పెంచుతూ ఉత్తర్వులు జారీచేశారన్నారు. గిరిజన రైతులకు గిట్టుబాటు ధరతోపాటు జీసీసీ మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తోందన్నారు. జాతీయ ధరలు అనుగుణంగా ఇప్పటికే మూడు సార్లు కొనుగోలు ధరలు పెంచామన్నారు. నాలుగోవ విడతగా పార్చిమెంట్ కిలో రూ.350 నుంచి రూ.400, అరబిక చెర్రీ రూ.230 నుంచి రూ.250, రొబస్టా చెర్రీ రూ.130 నుంచి రూ.160కి పెంచామన్నారు. అలాగే ఆర్గానిక్ పద్ధతిలో రైతులు సాగు చేసిన కాఫీ పార్చిమెంట్ రూ.450, చెర్రీ రూ.330 ధరలకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు కాఫీ గింజలు జీసీసీకి విక్రయించిన వెంటనే నగదు అందజేస్తామన్నారు. అలాగే ఇప్పటికే జీసీసీకి కాఫీ గింజలు విక్రయించిన గిరిజన రైతులకు ఈ అదనపు నగదు రెండు, మూడు రోజుల్లో బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామన్నారు. వివరాలకు 8639393525, 7013070990 నంబర్లకు సంప్రదించాలన్నారు

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత

అనంతగిరి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రా పంచాయతీ కేంద్రంలోని డ్రైవర్ కొర్రా చిన్న ఇటీవల గుండెపోటుతో మృత్యువాతపడ్డారు. విషయం తెలుసుకున్న మాతృభూమి సేవా సంఘం సభ్యులు గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. పిల్లల చదువుకు, తదితర అసరాలను అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోని సభ్యులు నగేశ్, సూరిబాబు, దేవ్, సురేంద్ర, మోహనరావు, జయమ్మ, తూర్పుకాపు సామాజిక సంఘం నాయకులు రామ్మోహన్, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధి ద్వారా గిరిజనులకు ఉపాధి: కలెక్టర్

పాడేరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ఉపాధి కలిగేలా జిల్లాలో పర్యాటకాభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని, అందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. అరకు చలి ఉత్సవ్‌లో భాగస్వాములుగా నిలిచిన అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని టూరిజం ప్రాంతాలను ప్రభుత్వ పరంగా అభివృద్ధి చేసి సంబంధిత గ్రామాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తే గిరిజనులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో పంచాయతీరాజ్, అటవీ, గిరిజన చట్టాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అలాగే పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఏజెన్సీలో అడ్వాంచర్ టూరిజం అభివృద్ధి చేయాలన్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ఉన్న గిరిజన కళాకారులను గుర్తించాలన్నారు. మూడు రోజులు నిర్వహించిన అరకు చలి ఉత్సవ్ నిర్వహణపై అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది మరింత అద్భుతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఈ ఉత్సవ్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేసిన అధికారులకు కలెక్టర్, జేసీ అభిషేక్‌గౌడ, సబ్‌కలెక్టర్ శౌర్యమన్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, డీపీవో బి.లవరాజు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అరకు ఉత్సవ్ విజయంతం చేసిన డీఆర్‌డీఏపీఈడీ జ్ఞాపికలందిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, పక్కన డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి, సబ్ కలెక్టర్ శౌర్యమన్

సేంద్రియ కాఫీకి గిట్టుబాటు ధర

» జీసీసీ మార్కెటింగ్ జీఎం, విజిలెన్స్ అధికారి ఉమాదేవి



గొందిపాకలు గ్రామంలో గిరిజన రైతులతో మాట్లాడుతున్న ఉమాదేవి

చింతపల్లి, ఫిబ్రవరి 6 , (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సేంద్రియ విధానంలో కాఫీని సాగు చేస్తున్న గిరిజన రైతులకు జీసీసీ ద్వారా మెరుగైన గిట్టుబాటు ధరలను కల్పిస్తున్నట్లు ఆ సంస్థ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ , విజిలెన్సు అధికారి ఉమాదేవి అన్నారు. గురువారం ఆమె చింతపల్లి జీసీసీ డీఎం దేవరాజ్‌తో కలసి మండలంలోని గొందిపాకలు, లంబసింగి, లబ్బంగి, చనలరడ, తదితర గ్రామాల్లో కాఫీ రైతులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో కాఫీకి మంచి ధరలు లభిస్తున్నాయన్నారు. ఏటా కాఫీ సాగు చేస్తున్న రైతులను వ్యాపారులు , దళారులు అనేక విధాలుగా మోసగిస్తున్నారని అన్నారు. అధిక వడ్డీలను వసూలు, తూకాల్లో తేడా, తరుగు పేరుతో రైతులను మోసగిస్తున్నారన్నారు. వీటిని రైతులు గమనించాలన్నారు. జీసీసీకి విక్రయించే రైతులకు వచ్చిన లాభాల ఆ ధారంగా బోనస్‌ల చెల్లిస్తామన్నారు. రుణాలను అతితక్కువ వడ్డీకి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డీఎం దేవరాజ్, సీసీసీ సేల్స్‌మేన్ లు శాండి ఇన్‌స్పెక్టర్లు పూలింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



మెడికల్ కళాశాల్లో యోగా శిక్షణ అందిస్తున్న పతంజలి శ్రీనివాస్

పాడేరురూరల్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్య ఒత్తిడితో కూడుకున్నదని, అందువల్ల ఈ విద్యార్థులకు యోగా, ధ్యానం చేయాలని స్థానిక మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.టి.హేమలతదేవి అన్నారు. యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాశాలలో యోగా కార్య క్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా సాధనతో విద్యార్థులలో ఏకాగ్రత, క్రమశిక్షణ, ధైర్యం వంటి లక్షణాలు అలవాటు అవుతాయన్నారు. కళాశాల విద్యార్థులకు ఈ శిక్షణ మూడు రోజులపాటు అందిస్తారు.

మాజీ సర్పంచ్ చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

చింతపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరులో గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పెదబరడ మాజీ సర్పంచ్ బోయిన సత్యనారాయణ వ్యక్తిగత నిధులు కేటాయించి పరిష్కరించారు. ఈ గ్రామంలో 120 గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. తాగునీటి పథకం పైపులు పాడైపోవడంతో నాలుగు నెలలు గా గిరిజనులు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మాజీ సర్పంచి తన సొంత నిధులతో పైపులను సమకూర్చిగురువారం నీటి సమస్యను పరిష్కరించారు.

తగ్గని పొగమంచు.. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

పాడేరు, ఫి బ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మన్యంలో పొగమంచు తీవ్రత తగ్గలేదు. కానీ కనిష్ఠ ఉష్ణోగ్రతలు మాత్రం క్రమంగా పెరుగుతున్నాయి.

అయినప్పటికీ ఉదయం తొమ్మిదిన్నర గంటల వరకు పొగమంచు దట్టంగానే కమ్మేస్తోంది. తాజా వాతావరణ మార్పుల కారణంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం క్రమంగా పెరుగుతున్నాయి. ఏజెన్సీలో గురువారం జి.మాడుగుల 12.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా జీకేవీధిలో 12.8, చింతపల్లిలో 13.3, పాడేరులో 14.0, అరకులోయలో 14.5, డుంబ్రిగుడ, హుకుంపేటలో 14.7, పెదబయలులో 15.1, ముంచంగిపుట్టులో 15.6, అనంతగిరిలో 16.7, కొయ్యూరులో 17.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



పాడేరులో గురువారం పొగమంచు

రవాణా శాఖ మంత్రి దృష్టికి ఆర్టీసీ సమస్యలు



అమరావతిలో రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసిన రీజియన్ చైర్మన్లు

అరకులోయ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సచివాలయంలో టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర గురువారం కలిశారు. ఆ వివరాలను స్థానిక విలేకరులకు దొన్నుదొర తెలిపారు. తమ పరిధిలో ఆర్టీసీ పరంగా నెలకొన్న సమస్యలు, పలు ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు విస్తరణపై మాట్లాడామన్నారు. అలాగే, రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి కాంతీలాల్ దండేని సచివాలయంలో తన క్యాంప్ కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు. ఆర్టీసీ సేవలుకు సంబంధించిన పలు అంశాలను చర్చించామన్నారు.తనతో కలిసిన వారిలో నెల్లూరు, విజయవాడ ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ చైర్మన్లు రెడ్డి అప్పలనాయుడు, సురేశ్ రెడ్డి, నాగరాజు ఉన్నట్లు తెలిపారు.

'రాజకీయాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి సహకరించాలి'



మాట్లాడుతున్న సీలేరు వర్తక సంఘం నాయకులు

సీలేరు, ఫిబ్రవరి 6 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరుకు చెందిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు రాజకీయాలను పక్కనపెట్టి గ్రామాభివృద్ధికి పాటుపడాలని స్థానిక వర్తక సంఘం నాయకులు హితవు పలికారు. సీలేరు మార్కెట్ సెంటర్‌లో బస్ షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణాలపై కాంగ్రెస్, వైసీపీ, కూటమి నాయకులు గత రెండు రోజులుగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేస్తున్నారు. ఈ అభివృద్ధి పనులకు ఈ ఆరోపణలు ఆటంకంగా భావించిన వర్తక సంఘం సభ్యులు మార్కెట్‌లో సమావేశమయ్యారు. మార్కెట్ సెంటర్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్న బస్ షెల్టర్, మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని పునర్ నిర్మిస్తున్నారన్నారు. ఈ పనులకు రాజకీయాల ఎత్తుగడలతో చెడగొట్టవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో వర్తక సమం అధ్యక్షుడు ఎండీ సబిక్, కార్యదర్శి జి. దారబాబు, సభ్యులు చుక్కల చిన్నా, ఎస్. దారబాబు, వానపల్లి అప్పారావు, పి. లక్ష్మణరావు, రవి, శ్రీను పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

అరకులోయ,ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. భరత్‌కుమార్‌నాయక్ అన్నారు. గురువారం కళాశాలలో రహదారి భద్రతమాసోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమంను ఎన్ఎస్ఎస్ పీవోలు, విశాఖపట్నం కు చెందిన నెహ్రూ యువకేంద్రం వారు సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు పలు అం దించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మీ, అనితకుమారి, నాగబాబు మాట్లాడుతూ ఇటీవల యువత ఇష్టారీతిగా వాహనాలను నడుపుతూ ప్రమాదాలు పాలవుతున్నారన్నారన్నారు. వాహనాలు నడిపేవారే కాకుండా ఎదురుగా వచ్చే వారు ప్రాణాపాయ స్థితికి వెళ్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అ ధ్యాపకులు గణేశ్, ఎస్.రాజు, బి.లచ్చన్న, ఎస్.సొంబాబు, ఎస్.అప్పారావు, కె.అంబిక, కె.భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

» సాగర మత్స్య పరిశోధన సంస్థ శాస్త్రవేత ఖుజురుద్దీన్



మత్స్యకారులకు పడవను అందిస్తున్న శాస్త్రవేతల బృందం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : కేజ్ కల్చర్ (పంజరంలో చేపల పెంపకం) ద్వారా ఆర్థికంగా ఎదిగేందుకు వీలవుతుందని విశాఖ సాగర మత్స్య పరిశోధన సంస్థ శాస్త్రవేత జె.కె.ఖుజురుద్దీన్ అన్నారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు సాగర మత్స్య పరిశోధన సంస్థ శాస్త్రవేతల బృందం గురువారం మండలంలోని సుజనకోట మత్స్యగెడ్డ ఒడ్డున గత కొన్నేళ్లుగా వృథాగా ఉన్న చేపల పెంపకానికి ఉపయోగించే కేజ్ కల్చర్‌ను వారు పరిశీలించారు. స్థానిక గిరిజన మత్స్యకారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా శాస్త్రవేత ఖుజురుద్దీన్ మాట్లాడుతూ కేజ్ కల్చర్ ద్వారా చేపల పెంపకంపై మత్స్యకారులు దృష్టిసారించాలని, తక్కువ శ్రమంతో ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం టీఎస్‌పీ నిధులు రూ.50 వేలతో చేపల వేట కోసం పడవను సుజనకోట గిరిజన మత్స్యకారులకు అందించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేతలు జయశ్రీ, రితేష్‌రంజన్, శేఖర్, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాస్, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి, సర్పంచులు రమేశ్, బాబూరావు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



మత్స్యకారులకు పడవను అందిస్తున్న శాస్త్రవేతల బృందం

కొయ్యూరు, ఫిబ్రవరి 6 , (ఆంధ్రజ్యోతి) : గర్భిణుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీడీపీఓ విజయకుమారి ఆదేశించారు. మండలంలోని కంటారం, మర్రిపాలెం అంగన్‌వాడీ సెక్టార్ల పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలకు గదబపాలెంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ఆయా కేంద్రాల పరిధి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల ఆరోగ్య పరిరక్షణపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల నిర్మూలనకు ప టిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు సునీత, బాలమణి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో వైద్య పోస్టులు భర్తీ చేయాలి: సీపీఎం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి నేత కె.త్రినాథ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీలో వివిధ విభాగాల్లో సుమారు పది మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, కేవలం ముగ్గురినే నియమించారని అన్నారు. 23 పంచాయతీల ప్రజలు ఆధారపడి ఉన్న సీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బంది కొరతతో వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గైనకాలజిస్ట్ లేక మహిళలు, గర్భిణీలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

జమాదులపాలెంలో సమస్యల తిష్ట

- రోడ్లపైనే మురుగునీరు
- చీకటి పడితే దోమల దండయాత్ర


శిథిలస్థితిలో డ్రైనేజీ


కాలువలు లేక రోడ్డుపైనే మురుగునీరు


రామాలయానికి వెళ్లే రోడ్డులో కాలువలు లేని దృశ్యం

కశింకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పల్లెలే భారతావనికి పట్టుగొమ్మలని గాంధీజీ ఉపదేశించినా, గ్రామాల ప్రగతి కోసమంటూ ఏలికలు అనేక పథకాలను వల్లెవేస్తున్నా కొన్ని గ్రామాలు ప్రగతి వెలుగులు చూడడం లేదు. మండలంలోని జమాదులపాలెం ఇందుకు ప్రబల నిదర్శనం. ఈ గ్రామంలో అడుగడుగునా సమస్యలు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా ఈ గ్రామం మాత్రం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి రోడ్లు, కాలువలు లేవు. ఎక్కడికక్కడే డ్రైనేజీలు దెబ్బతినడంతో పాటు వాటి నుంచి వచ్చే ఊచల వల్ల పలు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామం నుంచి రోజూ అనకాపల్లి, కశింకోటకు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాకుండా ఈ ప్రాంతంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగించుకునేవారి సంఖ్య అధికంగా ఉంది. తెల్లవారుజామున కూలిపనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు సరైన రహదారి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న గ్రామానికి సరైన రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామంలో కాలువలు ఏర్పాటు చేయాలి

గ్రామంలో ఉన్న ప్రతి రోడ్డు మార్గంలోనూ కాలువలు లేకపోవడం ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైకి విడిచిపెడుతున్నారు. కాలువల లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి ఇంటి నుంచి వచ్చే మురుగునీరు రోడ్డుపైనే విడిచిపెట్టడం వల్ల చీకటి పడితే దోమలు కంటి మీద కునుకు లేకుండా ప్రజలపై దండయాత్ర చేస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

డ్రైనేజీలు నిర్మించండి

గ్రామంలో సుమారు 20 ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీలు ప్రస్తుతం శిథిల స్థితికి చేరుకున్నాయి. రోజూ గ్రామంలో చిన్న పిల్లలు అటువైపు వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటికి తోడు డ్రైనేజీలకు పైకప్పు నిమిత్తం చేసి పలకల నుంచి జంగుపట్టిన ఊచలు బయటకు దర్శనమివ్వడంతో గ్రామస్థులు పలు ప్రమాదాల బారిన పడుతున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో సమస్యలపై దృష్టి నిలిపి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

నేడు, రేపు అనకాపల్లిలో తాగునీటి సరఫరాకు అంతరాయం

కొత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-7 అనకాపల్లి పట్టణ పరిధిలో తాగునీటి సరఫరాకు ఈ నెల 7, 8 తేదీల్లో అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ నీటిసరఫరా సాంకేతిక విభాగం ఈఈ ఎస్.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మపాల మంచినీటి హెడ్ వాటర్ వర్క్ పంప్‌హౌస్ వద్ద నీరు రంగు మారినట్లుగా గుర్తించామన్నారు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో మరమ్మతులకు ఉపయోంచిన నీటిని శుద్ధి చేయకుండా నేరుగా శారదానది పరివాహంలోకి విడుదల చేయడం దీనికి కారణంగా భావించామని తెలిపారు. దీనివల్ల అనకాపల్లి పట్టణ ప్రాంతాల్లో ఉన్న 6 ప్రధాన రిజర్వాయర్లకు నీటిని సరఫరా చేయడం లేదన్నారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు. తాగునీటిని శుద్ధి చేసి ఈ నెల 9 నుంచి యథావిధిగా పునరుద్ధరించి సరఫరా చేస్తామని తెలిపారు. మంచినీటి ట్యాంకర్లు అవసరమైనవారు సహాయక ఇంజనీర్లు 8978486139, 8247066778, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ 7386957240, కార్యనిర్వాహక ఇంజనీర్ 9948078503 నంబర్లకు సంప్రదించాలని ఆయన సూచించారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి లక్ష బిల్వార్చన


పూజలు చేస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి శతజయంతి ముగింపు ఉత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ మండపంలో దంపతులతో నగరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు, లక్ష బిల్వ నామార్చనలు, 108 మంది మహిళలు సుహాసినీ పూజలు చేశారు. నీరాజనం, మంత్రపుష్పం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బిళ్ళపాటి కృష్ణకుమార్, కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, వుప్పల రవిరామ్ జవహర్, గ్రంధి వీవీయూఎస్ మాణిక్యం, వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్‌పై హర్షం


అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర

అనకాపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రఐటీ, విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర గురువారం అమరావతిలోని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీసీలకు నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల సురేంద్ర మంత్రికి అభినందనలు తెలిపారు.

ఘనంగా అడవిరాజులు బాబు పండుగ


అడవిరాజులు బాబును దర్శించుకుంటున్న నేతలు

కశింకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ తాళ్లపాలెం బంగారయ్యపేట గ్రామంలో అడవిరాజులు బాబు పండుగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కూటమి నేతలు కాయల మురళి, ఒమ్మి సత్యనారాయణ, బుజ్జి తదితరులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు తదితరులు

పరవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రావాడ ఎస్సీ కాలనీ, కలపాక ఎస్సీ వీధిలోని పేదలకు దుప్పట్లు సమకూర్చింది. వీటిని రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, సింహాద్రి ఎన్టీపీసీ సీపీజీ విభాగం ఏజీఎం బి.నర్సింగరావులు గురువారం పంపిణీ చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మీనా, బి.మణికుమార్, కె.నారాయణరావు, ఎన్.సురేశ్, కె.సింహాచలం, చిట్టిబాబు, చినబ్బాయి, శివాని మీనా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


గుడ్ల హరీశ్‌రెడ్డి

సబ్బవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సబ్బవరానికి చెందిన వ్యక్తి అదృశ్యంపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాల ప్రకారం.. సబ్బవరానికి చెందిన గుడ్ల హరీశ్‌రెడ్డికి సొంత కారు ఉంది. దాన్ని అద్దెకు తిప్పుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గత నెల 26న కారుతో బయటకు వెళ్లి ఇంతవరకు ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారి ఇళ్లు, గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభ్యంకానందున గురువారం హరీశ్‌రెడ్డి చిన్నాన్న గుడ్ల భూలోకరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరీశ్‌రెడ్డి కొంత కాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నందున, తిరిగి వస్తాడని ఎదురు చూస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారని సీఐ పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు తమకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

తొలి దశలో గుర్తిస్తే క్యాన్సర్ నివారణ సాధ్యమే


తుమ్మపాలలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


గొర్లివానిపాలెంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి

పరవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ, రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో బి.లలిత కుమారి సూచించారు. ఈసీసీఈ డేను పురస్కరించుకొని గొర్లివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రొమ్ము క్యాన్సర్‌పై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తిస్తే వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు పోషకాహారంతో పాటు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే షకీలా, అంగన్‌వాడీ టీచర్ సీహెచ్.దేవి, ఏఎన్‌ఎం గౌతమి, ఎంఎస్‌కే యశోద, ఆశ కార్యకర్తలు ఎ.వరలక్ష్మి, ఎ.చంద్రకళ, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

వ్యాధిపై అవగాహన అవసరం

తుమ్మపాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి నజరత్ షమీమ్ పేర్కొన్నారు. తుమ్మపాల, కొండుపాలెం గ్రామాల్లో స్థానికులకు ఈ వ్యాధిపై అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు గుర్తించినవారు తక్షణమే వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. క్యాన్సర్‌ను నివారించాలంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించగలిగితే ఎండీటీ చికిత్స ద్వారా న యం చేయవచ్చునన్నారు. భయపడకుండా అవగాహన పొందాలనానరు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బి.మంగమ్మ, బి.సంగం, శాంతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: సీఐ


అవగాహన కార్యక్రమంలో సూచనలిస్తున్న సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సీఐ పిన్నింటి రమణ సూచించారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో సబ్బవరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే సంక్షిప్త సందేశాలకు (మెసేజ్‌లు) బదులివ్వవద్దన్నారు. బ్యాంక్ లావాదేవీలు, పిన్/ఓటీపీ తదితర నెంబర్లను ఇతరులకు తెలియపరచొద్దన్నారు. బ్యాంకులు, పని చేస్తున్న కార్యాలయాల నుంచి ఫోన్లలో ఎలాంటి సమాచారం అడగరనీ, అవసరమైతే నేరుగా కలవమని చెబుతారన్నారు. ఫోన్లో ఏ కొద్ది సమాచారం ఇచ్చినా ఖాతాలో డబ్బును, వ్యక్తిగత విషయాలను దొంగిలిస్తారన్నారు. విద్యార్థులు, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉంటూ.. కుటుంబీకులు, బంధువులు, తెలిసినవారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని బ్యాంకు మేనేజర్ డాక్టర్ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిబ్బంది అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై వెలుగులేవీ?


లంకెలపాలెం రహదారిలోని ఆర్ అండ్ బీ వంతెన

లంకెలపాలెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లంకెలపాలెం నుంచి ఫార్మాసిటీ, పరవాడ వెళ్లే ప్రధాన రహదారిలో స్థానిక రైల్వే ట్రాక్‌పై గల ఆర్‌అండ్‌బీ వంతెనకు ఇరువైపులా చీకట్లు అలముకున్నాయి. రెండు నెలలుగా దీపాలు వెలగడం లేదు. ఫార్మాసిటీలోని వివిధ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, ఉద్యోగులతో పాటు లంకెలపాలెం పరిసర గ్రామాల ప్రజలు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తుంటారు. చీకటి పడితే ఇక్కడ అంధకారం తాండవిస్తోంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ తమకు సంబంధం లేదంటూ, ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్వహణ పనులు చేపడతారని సమాధానం చెబుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారు స్పందించి వంతెనపై దీపాలు వెలిగేలా చొరవ తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా గాదాలమ్మ పండుగ


గాదాలమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న నాయకులు


గంగాలమ్మ అమ్మవారి పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పరవాడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా తానాం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత గాదాలమ్మ అమ్మవారి పండుగ గురువారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పైలా జగన్నాథరావు, సర్పంచ్ కన్నూరు దేవి వెంకటరమణ దంపతులు, ఉప సర్పంచ్ వర్రి మంగలక్ష్మి, స్థానిక నాయకులు రొంగలి అప్పారావు, పైలా కృష్ణారావు, డీఎంఎల్ నాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించి అనంతరం ఆలయం వద్ద ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

11న గంగాలమ్మ పండుగ


శ్యామా అమ్మవారికి అలంకరణ

తుమ్మపాల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం తుమ్మపాలలో ఈ నెల 11న అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గంగాలమ్మ అమ్మవారి పండుగ మహోత్సవ పోస్టర్‌ను గురువారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ, అమ్మవారి ఆశీస్సులు గ్రామానికి ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామ నాయకులు ఆడారి గోవిందరావు, చదరం నాగేశ్వరరావు, పీలా తాతునాయుడు, పీలా బుజ్జి, రాపేటి రామ్‌కుమార్, సందిన చినబాబు పాల్గొన్నారు.

ఘనంగా సిరి జ్యోతి పూజ

సబ్బవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సబ్బవరం మండలంలోని దేవీపురం గ్రామంలో రాజరాజేశ్వరీ సహస్రాక్షి అమ్మవారి పీఠంలో శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సిరిజ్యోతి పూజ గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకాలు, శోడశోపచార పూజ, సామూహిక కుంకుమార్చనలు, శ్యామా యంత్ర పూజ, సహస్ర నామార్చన నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కందర్ప రమా, కందర్ప ప్రభాకర్, వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో వచ్చిన ప్రజలు శ్యామా అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు. వేదపండితులు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు.

'పంచాయతీల్లో ధర్మనిధి సేకరణ చేపట్టాలి'


ధర్మ ప్రచారక్ సమావేశంలో మాట్లాడుతున్న గంగాధర్

కశింకోట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ సమావేశం గురువారం జరిగింది. ప్రచారక్ అధికారి గంగాధర్ మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలను ప్రణాళిక ప్రకారం విభజించి ఈ నెల 8 నుంచి 26 వరకు ధర్మనిధి సేకరణ కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలోనూ ధార్మిక సమితులతో సమావేశం ఏర్పాటు చేసి ధర్మనిధి సేకరణలో మరింత ఉత్సాహం పెంచాలన్నారు. అనంతరం ధర్మనిధి పుస్తకాలు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా, సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాల అనుమతి రద్దుకు డిమాండ్


ఎం.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కొత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో ఎన్‌టీఎస్ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి బాలికపై అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు లైంగిక దాడి చేయడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ అన్నారు. హోం మంత్రి జిల్లాలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతుంటే, ఆమె నేరస్తులకు కాపు కాస్తున్నట్లేనని ఆరోపించారు. ఇప్పటి వరకు జరిగిన సంఘటనలపై ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎటువంటి చర్యలు చేపట్టాయో బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై తగిన చర్యలు తీసుకోవడమే కాకుండా పాఠశాల అనుమతిని రద్దు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, పాఠశాల రద్దు చేసేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామని గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

పరిమితికి మించి రాయి తరలిస్తున్న రెండు లారీలకు జరిమానా

కొత్తూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం వేటజంగాపాలెం నుంచి క్వారీ రాయిని తరలిస్తున్న రెండు లారీలను అడ్డుకుని గనుల శాఖ అధికారులకు అప్పగించగా జరిమానా విధించారని అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ గురువారం తెలిపారు. పరిమితికి మించి లోడు చేసినా, బిల్లులు లేకుండా క్వారీ రాయిని తరలించినా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిబంధనలు పాటించాలని సూచించారు.

'ప్రత్యేక హోదా ఊసెత్తని కేంద్రం'


సబ్బవరంలో నిరసన తెలుపుతున్న సీపీఎం కార్యకర్తలు

సబ్బవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగిందని సీపీఎం మండల పార్టీ నాయకురాలు ఉప్పాడ సత్యవతి అన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీకి ప్రకటించిన ప్రత్యేక హోదా ఇవ్వలేదన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీ ప్రకారం ప్రత్యేక ప్యాకేజీ ఊసెత్తలేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బర్ల రమణ, నూకరాజు, దేవుడు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభతరం

- జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ బాలకృష్ణ



మాడుగుల, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) : గతంలో కంటే సులభతరంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు అయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్టు రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) జి. బాలకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించారు. రిజిస్ట్రేషన్లు జరుపు తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతం లో కన్నా రిజిస్ట్రేషన్లు పెరిగే విధంగా చర్య లు తీసుకుంటున్నామని అన్నారు. రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు ఇకనుంచి లేఖర్లే అవసరం లేదని, ఎవరికి వారే రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని చెప్పారు. ఆస్తి కొనుగోలుదారులు చలానా తీసిన వెంటనే అన్నీ ఆన్‌లైన్‌లో డేటా పొందుపరుస్తారన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విక్రయించే స్టాంపుల్లో తప్పులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే తప్పిదాలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సముంద్రంనకు సంబంధించి జీతాలు ఏడాదిగా కాకపోవడంపై ప్రశ్నించారు. సాంకేతిక సమస్య నెలకొనడంతో ఈ సమస్య నెలకొందని, రెండు రోజుల్లో ఆ సమస్య పరిష్కరిస్తామని డీఐజీ తెలిపారు. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్ కె మన్మథరావు, డీఐజీ వెంట విశాఖ జిల్లా రిజస్ట్రార్ వెంట ఉపేంద్ర, స్థానిక సబ్‌రిజిస్ట్రార్ పురుషోత్తం ఉన్నారు.

నేటి నుంచి కేశవ స్వామి కల్యాణ ఉత్సవాలు


కేశవస్వామి, అమ్మవారు

చోడవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ శ్రీ కేశవ స్వామి కల్యాణ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 వరకూ కొనసాగే ఈ ఉత్సవాలలో ఏటా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు అర్చకులు సుదర్శన సీతారామాచార్యులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

తీరంలో తాబేళ్ల మృత్యు ఘోష

సంతానోత్పత్తికి వచ్చి వేలాదిగా చనిపోతున్న కూర్మాలు

- మరణశాసనం రాస్తున్న వలలు, కాలుష్యం
- ఏపీ తీరంలో గత నెలలో 3,085 మృత్యువాత
- జాగ్రత్త చర్యలు తీసుకుంటున్న ఒడిశా, తమిళనాడు
- మన రాష్ట్రంలో చట్టాల అమలులో ఉదాసీనత
- మత్స్యకారులు అవగాహన పెంచుకోవాలంటున్న నిపుణులు
- హాని కలిగించే వలలు వినియోగంచవద్దని వినతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): తూర్పుతీరంలో ఒడిశా, తమిళనాడులతో పోల్చితే మన రాష్ట్రంలో ఎక్కువగా సముద్ర తాబేళ్లకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా తీరంలో విపరీతమైన కాలుష్యంతో పాటు మత్స్యకారుల చేపల వేటలో వచ్చిన మార్పులతో తాబేళ్లు ఎక్కువగా మృత్యువాత పడుతున్నాయి. మత్స్య, అటవీ, ఇతర ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, చట్టాల అమలులో కఠినంగా వ్యవహరించకపోవడం కూడా మరో కారణం. ప్రస్తుత సీజన్‌లో ముఖ్యంగా గత నెలలో ఏపీ తీరంలో 3,085 తాబేళ్లు చనిపోయాయి. దీనికి సంబంధించి 'ట్రీ ఫౌండేషన్' అనే సంస్థ గత నెలలో ఒక సర్వే చేపట్టింది. ఎల్‌నినో ప్రభావంతో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడంతో 2023 నవంబరు నుంచి 2024 మార్చి/ఏప్రిల్ వరకూ తూర్పుతీరంలో తాబేళ్ల రాక బాగా తగ్గింది. అయితే గత ఏడాది ఏప్రిల్ తరువాత ఎల్‌నినో బలహీనపడడంతో సముద్రంలో వాతావరణం తాబేళ్లకు అనుకూలంగా మారింది. దీంతో గత ఏడాది నవంబరు నుంచి సముద్ర తాబేళ్ల రాక మొదలైంది. డిసెంబరు నుంచి వీటి సంఖ్య పెరిగింది. జనవరిలో కూడా వేల సంఖ్యలో తాబేళ్లు వచ్చినట్టు గుర్తించారు.



తీరంలో మృతిచెందిన తాబేళ్లు

తీరానికి సమీపంలోనే ప్రమాదం

తాబేళ్లు ప్రతి 45 నిమిషాలకు ఒకసారి శ్వాస తీసుకునేందుకు సముద్ర ఉపరితలంపైకి వస్తాయి. సముద్ర తాబేళ్లు ఎక్కువ కాలం తీరానికి దూరంగానే గడుపుతాయి. అప్పుడు వాటికి పెద్దగా ప్రమాదం ఉండదు. సంతానోత్పత్తి కోసం తీరానికి ఐదు కిలోమీటర్ల దూరంలోకి వచ్చినప్పుడు ఎక్కువగా ప్రమాదం బారిన పడతాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు టేకు వలలు సహా ఇతర రకాల వలలు వినియోగిస్తారు. వలల్లో చిక్కుకునే తాబేళ్లు ఉపరితలంపైకి వచ్చి శ్వాసతీసుకునే అవకాశంలేకుండా గంటలకొద్దీ నీటిలోనే ఉండిపోవడంతో ఊపిరాడక చనిపోతున్నాయి. ఏపీ మెరైన్ ఫిషరీస్ రెగ్యులేషన్ యాక్టు ప్రకారం తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్లు దాటిన తరువాతే చేపల వేట చేయాలి. తీరం నుంచి కిలోమీటరు నుంచి రెండు కిలోమీటర్లు దూరంలోనే చేపల వేట చేస్తుండడంతో సంతానోత్పత్తి కోసం వచ్చే తాబేళ్లు చనిపోతున్నాయని 'ట్రీ ఫౌండేషన్' ఛైర్‌పర్సన్ సుప్రజ ధారి పేర్కొన్నారు. గిల్ నెట్ (కోనవల), అటుకవల, టేకు వలలు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల సంప్రదాయ మత్స్యకారులు వాడే నానాజాతి వలల్లో పడి వందలాది తాబేళ్లు చనిపోతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. గత నెలలో అత్యధికంగా బాపట్ల జిల్లాలో 529, తరువాత విజయనగరం జిల్లాలో 501, ప్రకాశంలో 453, శ్రీకాకుళంలో 363, కృష్ణాలో 334, కాకినాడలో 220, అనకాపల్లిలో 202, నెల్లూరులో 192, విశాఖపట్నంలో 146, తిరుపతి జిల్లాలో 145 తాబేళ్లు చనిపోయినట్టు ట్రీ ఫౌండేషన్ సర్వేలో తేలింది. అలాగే ఇటీవల కాలంలో తీరంలో పెరుగుతున్న కాలుష్యానికి కూడా ఊపిరాడక కొన్ని చనిపోతున్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

అవగాహన పెంచుకోవాలి

మత్స్యకారులకు ఎంతో మేలు చేసే తాబేళ్ల సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సుప్రజ ధారి అన్నారు. అటవీశాఖ భాగస్వామ్యంతో మత్స్యకారులకు తమ సంస్థ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే ప్రాంతంలో గడ్డి, పాచిని తాబేళ్లు తిని అక్కడ శుభ్రం చేస్తాయన్నారు. చేపలు అక్కడకు వచ్చి గుడ్లు పెట్టడంతో వాటి అభివృద్ధి జరిగి, మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. తమకు మేలు చేసే తాబేళ్లను రక్షించుకోవాలని మత్స్యకారులకు ఆమె సూచించారు. తాబేళ్లకు ఇబ్బందికరం కాని ప్రత్యేక వలలు వాడాలని సూచించారు. వలలో చిక్కుకునే తాబేలు బయటకు రావడానికి ప్రత్యేకంగా రూపొందించిన 'టెడ్' (టర్టిల్ ఎక్స్‌క్లూడర్ డివైజ్)ను వినియోగించాలన్నారు. ఇటువంటి డివైజ్‌లు వాడినప్పుడు వలలో పడిన తాబేళ్లు కేవలం నాలుగైదు శాతం చేపలు మాత్రమే బయటకు వస్తాయని, చేపలు వలలోనే ఉంటాయన్నారు. తీరం నుంచి ఎనిమిది కిలోమీటర్ల వరకు చేపల వేట చేసే బోట్లను ఇండియన్ కోస్టుగార్డు పర్యవేక్షించాలని ఆమె కోరారు.

ఒడిశాలో కొన్ని రకాల వలలు నిషేధం

నవంబరు నుంచి మార్చి/ఏప్రిల్ వరకు గల్ఫ్ ఆఫ్ మన్నార్ పరిసరాల్లో సముద్రంలో జీవించే తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తమిళనాడు నుంచి ఒడిశా వరకూ తీరానికి వస్తుంటాయి. అందుకే ఒడిశా తీరంలో అక్టోబరు నుంచి ఏప్రిల్ వరకు తీరం నుంచి 20 కిలోమీటర్ల దూరం వరకు సముద్రంలో కొన్నిరకాల వలలతో చేపల వేటను నిషేధించారు. దీనికితోడు తాబేళ్లు తీరానికి వచ్చే జాడలు కనిపిస్తే.. అటు వైపు మత్స్యకారులు కూడా చేపల వేటకు వెళ్లరు. గత నెలలో తమిళనాడులో భారీగా తాబేళ్లు మృత్యువాత పడడంతో అక్కడ ప్రభుత్వం అప్రమత్తమై కొన్ని రకాల వలల వాడకంపై నిషేధం విధించింది. ఏపీలో ఇంతవరకూ అటువంటి చట్టాల అమలుపై అధికారులు దృష్టిసారించలేదు.

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో పూజారికి తీవ్రగాయాలు


గాయపడిన రాంబాబు

మాడుగుల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మాడుగులలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. మండలంలోని ఎం.కోడూరుకు చెందిన పెద్దింటి రాంబాబు అదే గ్రామంలో లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. వ్యక్తిగత పనిమీద గురువారం ఉదయం ఎం.కోడూరు నుంచి ద్విచక్ర వాహనంపై గాజువాక బయలుదేరాడు. మాడుగుల హైస్కూల్ సమీపంలోకి వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో రాంబాబు రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ సంతోశ్‌కుమార్ ప్రథమ చికిత్స చేశారు. రాంబాబు తలకు బలమైన గాయం కావడం, వాంతులు అవుతుండడంతో మెరుగైన చికిత్స కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చినట్టు డాక్టర్ తెలిపారు.

110 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

పెదబయలు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీకరి పంచాయతీ పన్నేడా కూడలి వద్ద 110 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కొల్లి రమణ తెలిపారు. బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా సీకరి వైపు నుంచి వస్తున్న ఆటోలో గంజాయి పట్టుబడిందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది సమక్షంలో తూకం వేయగా, 110 కిలోలుగా తేలిందని చెప్పారు. గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ బ్లాక్ పరిధిలోని ధూలిపుట్ పంచాయతీ నిమ్మవీధికి చెందిన గలంగి బాలకృష్ణ, కుమడా బాలరాజులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు

కొత్తూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): బాలికతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, కులం పేరుతో దూషించిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని అనకాపల్లి పట్టణ సీఐ టి.వి.విజయ్‌కుమార్ గురువారం చెప్పారు. గవరపాలెంలో ఉన్న పాత జేఎల్ స్కూల్ ప్రాంతానికి చెందిన రేగాన జగన్ ఓ బాలికతో గత నెల 23న అసభ్యంగా ప్రవర్తించినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఫిర్యాదుపై అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో దర్యాప్తు జరిపి, నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

... 5వ పేజీ తరువాయి

జరిగిన స్కూల్‌కు తీసుకువచ్చి స్తంభానికి కట్టేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని గంగాప్రసాద్‌ను స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో హోంమంత్రి ఆదేశాల మేరకు కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావులు వడ్డాదిలోని ప్రైవేటు స్కూల్‌కు వెళ్లి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు స్కూల్‌కు చేరుకుని ప్రిన్సిపాల్ రామరాజు నుంచి వివరాలు సేకరించారు. కాగా విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నేషనల్ టాలెంట్ స్కూల్‌తో పాటు, మండలంలోని మరో రెండు స్కూళ్లలో కూడా లెక్కలు బోధిస్తున్నట్టు చెబుతున్నారు. కాగా విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని విద్యార్థిని కుటుంబీకులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వడ్డాది-తాటిపర్తి రోడ్డుకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి

రావడంతో రోడ్డుపై కనీసం గోతులు అయినా కప్పించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ సిమెంట్ కాంక్రీట్ మిక్సర్‌తో అక్కడక్కడా గోతులు కప్పించారు. అయితే వాటరింగ్ సరిగా చేయకపోవడంతో కొద్ది రోజులకే పిక్కలు లేచిపోయి దుమ్ము, ధూళి సమస్య అధికమైంది. ఈ పనులకు బిల్లు రాకపోవడంతో మిగిలిన పనులు కొనసాగించలేదు.

కూటమి ప్రభుత్వం రాకతో రోడ్డుకు మోక్షం

ఈ నేపథ్యంలో గత ఏడాది సాధారణ ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మాడుగుల నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బండారు సత్యనారాయణమూర్తి వడ్డాది- తాటిపర్తి రోడ్డుపై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్డు పనులు పునఃప్రారంభించేలా గతంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్‌ను ఒప్పించారు. గత ఏడాది డిసెంబరు ఐదో తేదీన ఆయనతోపాటు కలెక్టర్ విజయకృష్ణన్ ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తరువాత రోడ్డు పనులు ప్రారంభం అయ్యాయి. వడ్డాది నుంచి తాటిపర్తి వరకు రోడ్డుకు ఇరువైపులా ఒక్కో మీటరు చొప్పు విస్తరిస్తున్నారు. సుమారు రెండు అడుగుల మేర మట్టిని పూర్తిగా తొలగించి సిమెంట్ కాంక్రీట్ మిక్సర్ వేసి రోలింగ్ చేస్తున్నారు. అనంతరం పాత రోడ్డుతోపాటు మొత్తం తారు రోడ్డు వేస్తారు. ప్రస్తుతం ఐదున్నర మీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డు, విస్తరణ తరువాత ఏడున్నర మీటర్లకు పెరుగుతుంది. భారీ వాహనాలు ఎదురైనా ఇబ్బంది లేకుండా సాఫీగా ముందుకు సాగిపోవచ్చు. ఈ ఏడాది ఏప్రిల్ చివరినాటికి రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తవుతాయని ఆర్అండ్‌బీ నర్సీపట్నం డీఈఈ విద్యాసాగర్ తెలిపారు.

బాబోయ్ బడి ఆటోలు!

... 5వ పేజీ తరువాయి

సాగిస్తున్నారు. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సులు నడుపుతున్నప్పటికీ అవి కొన్ని రూట్లలో మాత్రమే తిరుగుతుండడంతో మిగిలిన ప్రాంతాల విద్యార్థులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇంటి నుంచి పాఠశాలకు ఉన్న దూరాన్ని బట్టి ఒక్కో విద్యార్థికి నెలకు ఇంత అని డ్రైవర్లు వసూలు చేస్తుంటారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం సాధారణ ఆటోలో పెద్ద వాళ్లు అయితే ముగ్గురు, చిన్నపిల్లలు అయితే ఆరుగురు, పెద్ద ఆటోల్లో పెద్ద వారైనా, పిల్లలైనా ఆరుగురే ప్రయాణించాలి. కానీ ఆటోలకు వెనుక సీటు ముందు చెక్క బెంచీ ఏర్పాటు చేసి పది మంది విద్యార్థులను ఎక్కిస్తున్నారు. ఇకపెద్ద ఆటోల్లో అయితే లగేజీ పెట్టుకుని వెనుకభాగంలో కూడా పిల్లలను కూర్చోబెడుతున్నారు. మొత్తంగా 15 నుంచి 20 మంది వరకు విద్యార్థులను కుక్కుతున్నారు. మరికొంతమంది డ్రైవర్లు తమకు ఇరువైపులా ఇద్దరిని కూర్చోబెట్టుకుంటున్నారు. ఇక పుస్తకాల బ్యాగులు, భోజనం క్యారియర్లు, వాటర్ బాటిళ్లతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తున్నది. బ్యాగులను ఆటోకి ఇరువైపులా తగిస్తుండడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆటోలో నిబంధనల మేరకు పిల్లలను తీసుకెళ్లాలని తల్లిదండ్రులు ఎవరైనా చెబితే.. మీరు ఇచ్చే డబ్బులకు ఆ విధంగా పిల్లలను తీసుకెళ్లి తమకు గిట్టుబాటు కాదని డ్రైవర్లు చెబుతున్నారు. కాగా పలు ఆటోలు ఉదయం, సాయంత్రం విద్యార్థులతో కిక్కిరిసి ప్రధాన రహదారుల మీదుగా ప్రయాణిస్తున్నప్పటికీ రవాణా, పోలీసు శాఖల అధికారులు పట్టించుకోవడంలేదు.

కేసులు నమోదు చేస్తాం

కేపీ ప్రకాశ్, ఎంవీఐ, అనకాపల్లి

రవాణా శాఖ నిబంధలను పాటించేలా ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం. పరిమితికి మించి ప్రయాణికులను.. ముఖ్యంగా విద్యార్థులను తీసుకెళ్లితే కేసులు నమోదు చేస్తాం. మద్యం సేవించి వాహనాలను నడిపితే డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేస్తాం.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

నర్సీపట్నంలో 9న సౌర యాగం

నర్సీపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా నగర్‌లోని పాత శారదా స్కూల్ ఆవరణలో ఈ నెల 9వ తేదీన సౌర యాగం నిర్వహిస్తున్నట్టు వైదిక బ్రాహ్మణ పురోహిత, అర్చక సంఘం అధ్యక్షుడు పేరి ఆదిత్య కుమార్ శర్మ తెలిపారు. గురువారం ఇక్కడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ, ఆదివారం ఉదయం ఉదయం గంటలకు సౌర యాగం ప్రారంభమవుతుందని, ఈ సందర్భంగా హోమంలో నిర్వహిస్తామని అన్నారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నప్రసాదం ఏర్పాటు చేశామని తెలిపారు. హోమంలో పాల్గొనే దంపతులు రూ.1,116లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కార్యదర్శి కె.పవన్‌కుమార్, భద్రాచల రామం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు రేపు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) సూచనల మేరకు దివ్యాంగుల నూతన క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు ఈ నెల 8న నిర్వహించనున్నట్లు డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని ఏసీఏ వీడీసీఏ-బీ గ్రౌండ్‌లో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ ఎంపికలలో పాల్గొనేందుకు విశాఖ, అనకాపల్లి జిల్లాలకు సంబంధించి శారీరక వైకల్యం ఉన్నవారు, అంధులు, చెవిటి, చక్రాల కుర్చీ కేటగిరీలకు చెందినవారు మాత్రమే అర్హులని స్పష్టంచేశారు. ఈ ఎంపికలలో పాల్గొనదలచినవారు తెల్లదుస్తులు ధరించి, సొంత కిట్‌తో హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులందరికీ నిర్వాహకులు భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. వివరాలకు వాసుపల్లి సురేష్ ఫోన్: 9059525933 నందు సంప్రదించాలన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

- ఎస్పీ తుహిన్ సిన్హా


ఎస్.రాయవరం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వచ్చిన మహిళతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పోలీస్ అధికారులకు ఎస్పీ తుహిన్ సిన్హా సూచించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద నిఘా పెట్టాలన్నారు. గురువారం సాయంత్రం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా దర్యాప్తు చేసి కేసులను తగ్గించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ఉమెన్ సేఫ్టీ వెహికల్‌తో గస్తీ నిర్వహించాలన్నారు. గ్రామాల్లో జూదాలు, అశ్లీల నృత్యాలు వంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని, కొద్ది రోజుల్లో జరగనున్న మాఘ పౌర్ణమి జాతరకు సంబంధించి రేవుపోలవరం సముద్రతీరం వద్ద అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

పెండింగ్ కేసులపై ఎస్పీ ఆరా

నక్కపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి):స్థానిక పోలీస్ స్టేషన్‌ను గురువారం మధ్యాహ్నం ఎస్పీ తుహిన్ సిన్హా తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల గురించి సీఐలు కుమారస్వామి, లొడ్డు రామకృష్ణ, ఎస్ఐ సన్నిబాబులను అడిగారు. 2019లో కాగిత-అమలాపురం రహదారి మధ్య జరిగిన గుర్తు తెలియని వ్యక్తి హత్య సంఘటనకు సంబంధించి ఆధారాలు, ఎటువంటి క్లూస్ దొరకలేదని సీఐ చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన రికార్డును పరిశీలించారు. ఏమైనా గుర్తించని మిస్సింగ్ కేసులున్నాయేమోనని, రెండు తెలుగు రాష్ట్రాల్లో వున్న అన్ని ఠాణాలకు ఈ సమాచారాన్ని పంపాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా? అని అడిగారు. హైవే పెట్రోలింగ్ సిబ్బందికి పలు ఆదేశాలు జారీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తంచేశారు.

గర్భం దాల్చిన హాస్టల్ విద్యార్థిని!

పోలీసుల అదుపులో యువకుడు?

భీమునిపట్నం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా భీమిలిలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థి ఒకరు గర్భవతి కావడం కలకలం రేపింది. సీఐ సుధాకర్ తెలిపిన వివరాలు ప్రకారం... అనకాపల్లి జిల్లాకు చెందిన ఒక బాలిక (17) భీమిలిలోని డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతోంది. బీచ్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటోంది. అదే గ్రామానికి చెందిన యువకుడు (18) మధురవాడలో గల ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇద్దరూ కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. శారీరకంగా ఒక్కటయ్యారు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చింది. గర్భం పోయేందుకు ఏవో టాబ్లెట్లు వేసుకోవడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో గురువారం ఇద్దరూ కేజీహెచ్‌కు వెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక మైనర్ కావడంతో వివరాలు ఆరా తీసి, భీమిలి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా బాలికకు తీవ్ర రక్తస్రావం అవుతుండడంతో వైద్యులు అబార్షన్ చేశారు. ఆ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయమై సంబంధిత హాస్టల్ మేట్రిన్ భారతితోను, భీమిలి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ జ్యోతి శ్రీతో మాట్లాడడానికి యత్నించగా వారు ఫోన్‌కు అందుబాటులో లేరు.


అన్న క్యాంటీన్‌లో అమ్మ రాజశేఖర్, ముక్కు అవినాశ్

అన్న క్యాంటీన్‌లో అమ్మ రాజశేఖర్ భోజనం

పేదలకు ప్రభుత్వం మంచి ఆహారాన్ని అందించడం హర్షణీయం

విశాఖపట్నం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద గల అన్న క్యాంటీన్‌లో గురువారం దర్శకుడు, డ్యాన్స్ మాస్టర్ 'అమ్మ' రాజశేఖర్, 'జబర్దస్త్' ఫేమ్ ముక్కు అవినాష్, తల చిత్రం ద్వారా హీరోగా పరిచయం అవుతున్న రాగిణి రాజ్‌లు భోజనం చేశారు. భోజనం కోసం సామాన్య ప్రజలతో కలిసి క్యూలో నిల్చున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ పేదల కోసం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌లో భోజనం చేయడం ఆనందంగా ఉందన్నారు. పేదలకు ప్రభుత్వం మంచి ఆహారాన్ని అందించడం హర్షణీయమన్నారు.

అలుపెరుగని సాధనతో విజయం

- విద్యార్థులకు కేంద్ర వాణిజ్య శాఖ కమిషనర్ రోషణి అపరంజి కొరాటి సూచన


సమావేశంలో మాట్లాడుతున్న రోషణి అపరంజి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి హార్డ్ వర్క్, స్మార్ట్ వర్క్ చేస్తే విజయం సొంత మని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు సంయుక్తాభివృద్ధి శాఖ కమిషనర్ రోషణి అపరంజి కొరాటి సూచించారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులు జరిగే వార్షికోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశను, ఉద్యోగావకాశాలను వినియోగించుకోవాలన్నారు. గౌరవ అతిథి శ్రీరామ్ పెంటకోట మాట్లాడుతూ విద్యార్థులు తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. ప్రస్తుత కాలంలో సమస్యలకు పరిష్కారం కనుగొనడం, తార్కిక ఆలోచన, క్రమశిక్షణ, కష్టపడేతత్వం ఉండాలన్నారు. కృత్రిమ మేధ, సాంకేతిక ప్రజ్ఞ (మెషీన్ లెర్నింగ్) ప్రాముఖ్యత, వీటికి సంబంధించిన ఉద్యోగావకాశాలు దేశ, విదేశాల్లో ఉన్నాయని, విద్యార్థులు వీటిని అందిపుచ్చుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ వైబ్రెంట్ డైట్‌కు సంబంధించి అనేక సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడలు నిర్వహించామని, తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం ప్రతిబింబించే విధంగా ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు 2024-25 సంవత్సరానికి సంబంధించి కళాశాల జాతీయస్థాయిలో సాధించిన విజయాలను, అభివృద్ధిని వివరించారు. అనంతరం అతిథులను రత్నాకర్ ఘనంగా సత్కరించారు. ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులను, ప్రతిభ చూపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు.

ఎలమంచిలి స్టేషన్‌కు సొబగులు

... 5వ పేజీ తరువాయి

కార్మికులు, కూలీల రాకపోకలు గణనీయంగా పెరగనున్నాయి. దీంతో ఈ రెండు మండలాలకు సమీపంలో వున్న అనకాపల్లి, ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్ స్టేషన్'ల జాబితాలో చేర్చింది. ఎలమంచిలి స్టేషన్‌ను సమూలంగా మార్చేస్తున్నారు. వివిధ రకాల పనులకు సుమారు 13 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. స్టేషన్‌లో ఇప్పటి వరకు రెండు ప్లాట్‌ఫారాలు మాత్రమే వుండేవి. కొత్తగా మూడో నంబరు ప్లాట్‌ఫారం నిర్మించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో కొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. దీంతోపాటు ఎస్కలేటర్, లిఫ్ట్ సదుపాయాన్ని కూడా అదుబాటులోకి తీసుకువస్తారు. ప్లాట్‌ఫారాలపై పూర్తిస్థాయిలో షెడ్లు లేకపోవడంతో వేసవిలో, వర్షాకాలంలో ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను తొలగించడానికి ప్లాట్ ఫారాలపై ఆ చివర నుంచి ఈ చివర వరకు రేకుల షెడ్లు వేయనున్నారు. అన్ని ప్లాట్‌ఫారాలను మార్బుల్స్ తీర్చిదిద్దుతున్నారు. ప్రయాణికులు రైలు ఎక్కేచోట యాంటీ స్కిడ్ టైల్స్ వేశారు. రైలుకు సంబంధించి ఏ క్లాస్ బోగీ, ఎక్కడ ఆగుతుందో తెలియపరచడానికి డిజిటల్ ఇండికేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. మహిళలు, పురుషులకు ఆధునాతన బాత్‌రూమ్‌లు, ప్రయాణికులు వేచి ఉండేందుకు హాలు నిర్మిస్తున్నారు. మరో ఆరు నెలల్లో ఈ పనులన్నీ పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.